ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
మంగళవారం 9 సెప్టెంబరు 2025

కొండను తవ్వేస్తున్నారు..!

● ఎమ్మిగనూరులో ఎర్రగరుసు దందా ● వదిలేస్తున్న అధికారులు
● చర్యలు చేపట్టకపోవడంతో రెచ్చిపోతున్న అక్రమార్కులు


గుడికల్ కొతిగట్టు కొండలో ఎర్రగరుసు తవ్విన దృశ్యం

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలో విలువైన కొండ సంపదపై అక్రమార్కులు కన్నేశారు. ఎమ్మిగనూరు పరిధిలోని కొతిగట్టు కొండను కొందరు ధనార్జనే ధ్యేయంగా తవ్వేస్తున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా అప్పటికి అప్పుడు సిబ్బందిని పంపి హడావుడి చేసి వదిలేస్తున్నారు. దీంతో అక్రమార్కుల గరుసు తవ్వకాలకు అడ్డుకట్ట పడటం లేదు. మండలంలోని గుడికల్ గ్రామ పరిధిలో ఎల్లెల్సీ కాలువను ఆనుకొని ఉన్న కొతిగట్టు(కొండ)లో గత నెల 30వ తేదీన అక్రమార్కులు ఎక్స్‌కవేటర్‌తో గరుసు తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు వీఆర్‌ఏలను కొండ దగ్గరకు పంపి గరుసు తవ్వకాలను అడ్డుకున్నారు. అక్రమార్కులు అక్కడి నుంచి పలాయనం చిత్తగించారు. ఐదు రోజులు గడిచాక శుక్రవారం కోటేకల్ పంచాయతీకి చెందిన అధికార పార్టీ నాయకుడు కొతిగట్టు కొండలో గరుసు తవ్వి ట్రాక్టర్ల ద్వారా ఎమ్మిగనూరు పట్టణానికి తరలించాడు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గుడికల్ వీఆర్‌ఏలను కొండ దగ్గరకు పంపి గరుసు తవ్వకాలను అడ్డుకున్నారు. దీంతో అక్రమార్కులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనుమతి లేకుండా గరుసు తవ్వకాలకు పాల్పడినప్పటికి ట్రాక్టర్లను, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేయకుండా వదిలేశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న దృశ్యం



తూతూ మంత్రంగా..

అధికారులు మొదట్లో అక్రమార్కులపై కేసు నమోదు చేయటం, ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్ స్వాధీనం చేసుకొని ఉంటే మరోసారి గరుసు తవ్వకాలు జరిగేవి కావు. తూతూ మంత్రంగా కింది స్థాయి సిబ్బందిని పంపి చర్యలు చేపట్టారు. దీంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గరుసు తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే మాసుమాన్‌దొడ్డి గ్రామ సమీపంలో ఉన్న పలమరసు కొండను అక్రమార్కులు ఖాళీచేశారు. ఇప్పుడు గుడకల్ కొతిగట్టు కొండపై దృష్టి సారించి ఓ వైపు నుంచి కొండకు కన్నం వేస్తు గరుసు తవ్వకాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించని పక్షంలో కొతిగట్టు కొండ కూడా మరో పలమరసు కొండగా మారనుందని ప్రజలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. గరుసు తవ్వకాలపై తహసీల్దార్ శేషఫణి, గుడికల్ వీఆర్‌వో వరలక్ష్మిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

గడువు లోపు అర్జీలు పరిష్కరించాలి: జేసీ


అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నవ్య అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జేసీ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో జేసీ సమీక్షించారు. పీజీఆర్‌ఎస్ లాగిన్‌లో పరిష్కరించిన అర్జీలను ఆడిట్ చేయాల్సి ఉందన్నారు. అర్జీల ఆడిట్ పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. పీజీఆర్‌ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను అలసత్వం వహించకుండా పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు చూడాలన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌కు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 11, కర్నూలు ఆర్డీవో వద్ద 8, పత్తికొండ ఆర్డీవో వద్ద 4, కలెక్టరేట్ ఏవో వద్ద 3, సర్వే ఏడీ, విద్యాశాఖ, డీఆర్‌డీఏ పీడీ, ఏపీఐఐసీ జెడ్‌ఎంల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్‌లో ఉన్న వాటిని బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లకుండా పరిష్కరించాలని జేసీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూరాధ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోటెత్తిన పల్లీలు

● ఆదోని మార్కెట్లో రాశులుగా పోసిన వేరుశగన
● క్వింటా గరిష్ఠంగా రూ.7154


ప్లాట్‌ఫాంపై రాశులుగా పోసిన వేరుశనగ దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం పల్లీలు పోటెత్తాయి. 15రోజుల తర్వాత వేరుశనగ విక్రయాలు తిరిగి ప్రారంభమయ్యాయి. రైతులు ఆయా ప్రాంతాల నుంచి వేరుశనగ దిగుబడులను తీసుకురావడంతో యార్డు అంతా కళకళలాడింది. గ్రేడింగ్ సమస్య పరిష్కారం కావడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. 6868 వేరుశనగ బస్తాలు విక్రయానికి తీసుకువచ్చారు. క్వింటాలు కనిష్ఠ ధర రూ.3,220, గరిష్ఠ ధర రూ.7,154, మధ్యధర రూ.6,690లు పలికాయి. రైతులు ఇంటి వద్దనే గ్రేడింగ్ చేసుకొని తీసుకొస్తే ఆశించిన స్థాయిలో ధరలు లభిస్తాయని మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవిందు తెలిపారు.

'ఓపి'క పోతోంది!

● విజృంభిస్తున్న జ్వరాలు
● సర్వజన ఆసుపత్రిలో కిక్కిరిసిన రోగులు
● ఒక్క రోజులోనే 3,291 మందికి ఓపీ

7



అభివృద్ధిని చూసి ఓర్వలేకనే తప్పుడు ప్రచారాలు

6

ఉల్లి రైతులను ఆదుకోండి

● ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల
● మార్కెట్ యార్డులో రైతులకు ఓదార్పు
● కనీస మద్దతు ధర రూ.2,500 ప్రకటించాలి


కర్నూలులో మహిళా రైతుతో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

కర్నూలు/ కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా రైతులకు అండగా ఉంటానని ఆమె భరోసానిచ్చారు. సోమవారం కుమారుడు రాజారెడ్డితో కలిసి హైదరాబాద్ నుంచి బయలుదేరిన షర్మిల కర్నూలులోని మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లా నుంచి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఉమ్మడి కర్నూలు డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్‌తో కలిసి ఆమె ఉల్లి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉల్లి రైతుల బాధలను అర్థం చేసుకోవాలని, కనీస మద్దతు ధర రూ.2,500 ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉల్లి రైతుల పరిస్థితి చాలా దారుణంగా ఉందని, పెట్టుబడి ఎకరాకు రూ.లక్షకు పైగా అయితే సగం కూడా చేతికి రావడం లేదని రైతులు కన్నీరు పెడుతున్నారు. ధరలు పతనమై, కూలీ, రవాణా ఖర్చులు కూడా గిట్టుబాటు కాక తాము పడుతున్న ఇబ్బందులను రైతులు వివరించారు. కూటమి ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వడం లేదని రైతులు చెబితే ఇక్కడే నిరాహారదీక్ష చేస్తానని అన్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.1,200లు ప్రకటించింది. ఏ వ్యాపారి కూడా ఆ రేటుకు కొనడం లేదని, వ్యాపారి కొనే ధరపైన వ్యత్యాసం ఉన్న నగదును ఖాతాల్లో జమ చేస్తామని జాయింట్ కలెక్టరు వచ్చి చెప్పారు. ఆ డబ్బు వస్తుందో రాదో అని రైతుల్లో భయం ఉందని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకోవాలని, వ్యత్యాసం అమౌంట్ ఖాతాల్లో జమ చేయడంతో పాటు గిట్టుబాటు ధర రూ.1,200లు ప్రకటించాలని షర్మిల డిమాండ్ చేశారు.

మిగతా 7వ పేజీలో

వైసీపీ నాయకులు డ్రామాలు ఆపాలి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ధ్వజం


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు డ్రామాలు ఆపాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ధ్వజమెత్తారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖరరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి మోసపూరిత వాగ్దానాలు నమ్మి ప్రజలు ఒక్క అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అన్నివిధాలుగా సర్వనాశనం చేశారని మండిపడ్డారు. కోడుమూరు నియోజవర్గం సి.బెళగళ్‌లో మద్యం తాగితే వైసీపీ నాయకులు పురుగుల మందు తాగినట్టు నాటకాలను గుర్తించామని చెప్పారు. సెల్ఫీ తీయించి 108కు ఫోన్ చేయించి, సోషల్ మీడియాలో ప్రచారం చేయించారని, తీరా ఆసుపత్రిలో వైద్యులు పురుగుల మందు సేవించలేదని నిర్ధారణ అయిందని చెప్పారు. ఇలాంటి నాటకాలతో ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే వారి ఆటలు కట్టిస్తామన్నారు. ఉల్లిరైతుల బాధలు తెలుసుకున్న ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటోందని, అయితే వైసీపీ శవరాజకీయాలు చేయడం మానుకోవాలని అన్నారు. మరోవైపు యూరియా కొరత సృష్టించడానికి కూడా తెగబడడం దుర్మార్గమైన చర్య అన్నారు. కోడుమూరు నియోజకవర్గంలో పొగాకు రైతులకు ఇబ్బందులు ఎదురైతే ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి కలెక్టర్‌ను కలిసి పొగాకును కొనుగోలు చేయించారన్నారు. ప్రభుత్వం రైతులను అన్నివిధాలుగా ఆదుకోవడానికి ముందుకు వస్తుంటే వైసీపీ మాత్రం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. సమావేశంలో వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ సంజీవలక్ష్మి, బేతం కృష్ణుడు, కేవీ సుబ్బారెడ్డి, వి.హనుమంతరావు చౌదరి, రాజు, షేక్షావలి పాల్గొన్నారు.

బాలల చట్టాల పరిరక్షణకు కృషి చేయాలి

● అధికారులకు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది సూచన



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

కర్నూలు లీగల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలల రక్షణ చట్టాల అమలుపై అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుని, వారి అభ్యున్నతికి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది సూచించారు. బాలల న్యాయం, రక్షణ చట్టాల అమలుపై సోమవారం స్థానిక లోక్ అదాలత్ భవనంలో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలల రక్షణ కేసులను నిర్వహించే పోలీసు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అవసరమని తెలిపారు. పోలీసులు, బాలల హక్కుల పరిరక్షణ విభాగాలు సమన్వయం చేసుకుని బాలల కేసులు సత్వరంగా పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. పోక్సో కోర్టు న్యాయాధికారి రాజేంద్రబాబు మాట్లాడుతూ పిల్లలపై లైంగిక వేధింపుల కేసులను త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, బాలలు ద్వితీయ శ్రేణి బాధితులుగా మారకుండా చూడాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ బాలల ప్రయోజనాల కోసం అన్ని పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక చైల్డ్ హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలన్నారు. జువైనల్ జస్టిస్ బోర్డు న్యాయాధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ జువైనల్ జస్టిస్ బోర్డు ముందు చట్టానికి విరుద్ధంగా ఉన్న బాలలను నిర్ణీత వ్యవధిలోగా హాజరు పరిచేలా చూడాలన్నారు. బాలల వయస్సు నిర్ధారణలో జాప్యం లేకుండా చేస్తే కేసులను త్వరగా పరిష్కరించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాధిక, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ జుబేదా బేగం, ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించిన పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు 8,011 క్వింటాళ్ల ఉల్లి

● మొత్తం ఉల్లి అంతా కొనుగోలు చేశాం ● సెక్రెటరీ జయలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డుకు సోమవారం 8,011 క్వింటాళ్ల ఉల్లిగడ్డలను రైతులు అమ్మకానికి తెచ్చారని మార్కెట్ సెక్రెటరీ జయలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇందులో 4,978 క్వింటాళ్లను వ్యాపారులు కొనగా మిగిలిన 3,033 క్వింటాళ్లను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిందన్నారు. ఎప్పటికప్పుడు ఉల్లిని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ఉల్లిగడ్డలకు క్వింటానికి రూ.1,200 మద్దతు ధర అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రతి రైతుకు ఈ ధర అందుతుందని , రైతులు ఆందోళన చెందొద్దు అన్నారు. రైతులు గ్రామాల్లోనే ఉల్లిగడ్డలను క్లీన్ చేసి యార్డుకు తెస్తే ఉల్లి పాడుకాకుండా ఉంటుందని సూచించారు. తక్కువ సమయంలోనే అమ్మకాలు జరుగుతాయని, రైతులు తమ సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్



కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీకి జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు 9 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 8 మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలు, 49 సహాయకుల పోస్టుల భర్తీకి సంబంధించి ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.విజయ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు 10వ తరగతి, ఏపీ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన బోర్డుల ద్వారా ఉత్తీర్ణత ఉండాలని, సహాయకుల పోస్టులకు 7వ తరగతి పాస్ కావాలన్నారు. 1.7.2025 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. పెళ్లి అయి అదే గ్రామంలో నివాసితులై ఉండాలన్నారు. నియామకాల్లో రూల్‌ఆఫ్ రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. ఖాళీల వివరాలకు సంబంధిత సీడీపీవో కార్యాలయంలో గానీ, కార్యాలయం నోటీసు బోర్డులో చూసుకోవాలన్నారు. దరఖాస్తులతోపాటు సంబంధిత సర్టిఫికెట్ల నకలును జతపరిచి సీడీపీవో ఐసీడీఎస్ కార్యాలయంలో 17వ తేదీ లోపు అందజేయాలని తెలిపారు.

క్వార్టర్స్‌ను ఖాళీ చేయాల్సిందే

● ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి


క్వార్టర్స్‌ను ఖాళీ చేయిస్తున్న జిల్లా అధికారులు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దశబ్దాల కాలంగా ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్‌లో అక్రమంగా, అనధికారికంగా నివాసం ఉంటున్న వారు ఖాళీ చేయాల్సిందేనని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, విద్యుత్ శాఖలు మూడు టీమ్‌లుగా ఏర్పడి ఏ, బీ, సీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నవారిని ఖాళీ చేయించేందుకు చర్యలు చేపట్టారు. మొత్తం 953 క్వార్టర్స్‌లో 363 అధికారికంగాను, 490 అనధికారికంగా, 96 శిథిలావస్థలో ఉన్నట్లు ఆయన తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో అక్రమంగా ఉన్నటువంటి వారిని క్వార్టర్స్ నుంచి ఖాళీ చేయిస్తున్నామన్నారు. ఖాళీ చేయని వారి కొళాయి, విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తామని హెచ్చరించారు.

ఉద్యోగులు మెరుగైన సేవలందించాలి

● ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు తక్షణమే చేపట్టండి
● 'సూర్యఘర్'ను ప్రజలకు చేరువ చేయాలి
● ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోష్ రావ్
● విద్యుత్ ఉద్యోగుల చైతన్య సదస్సు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోషరావ్ అన్నారు. సోమవారం సాయంత్రం నంద్యాల ఎల్‌కేఆర్ ఫంక్షన్‌హాలులో విద్యుత్ ఉద్యోగుల చైతన్య సదస్సు నిర్వహించారు. నంద్యాల విద్యుత్ శాఖ ఎస్‌ఈ సుధాకర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈసదస్సుకు సీఎండీతో పాటు డైరక్టర్ గురువయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో ప్రత్యేకించి దృష్టి సారించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ క్రమంలో విద్యుత్ పంపిణీలో నష్టాలు, అంతరాయాలు, త్రీఫేజ్ కరెంట్, అమరికలు, సూర్యఘర్, ప్రతి ట్రాన్స్‌పార్మర్‌కు ఏబీ స్విచ్ బిగింపులు వంటి పలు అంశాలపై విద్యుత్ ఉద్యోగులకు చైతన్యం కలిగించారు. గ్రామీణ ప్రాంతాల్లో త్రీఫేజ్ కరెంటు సరఫరా చేయడంతో ఆ గ్రామాల అభివృద్ధితో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి గణనీయంగా ఉంటుందన్నారు. ఆర్‌డీఎస్ స్కీమ్ కింద గ్రామాల్లో కరెంటు సరఫరాకు అయ్యే ఖర్చులో కేంద్రం 70 శాతం, రాష్ట్రం 30 శాతం భరిస్తుందన్నారు


మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోష్ రావ్

మిగతా 7వ పేజీలో

'కళా ఉత్సవ్' పోస్టర్ ఆవిష్కరణ



డైట్ కళాశాలలో పోస్టరును విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11వ తేదీన కర్నూలు జిల్లా స్థాయి కళా ఉత్సవ్ ఘనంగా నిర్వహిస్తున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ డా.అయూబ్ హుస్సేన్ తెలిపారు. ఈ కళా ఉత్సవ్ సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళా ఉత్సవ్ విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే వేదికగా మాత్రమే కాకుండా వారి సృజనాత్మకత, సాంస్కృతిక విలువలను పెంపొందించే పండుగా నిలుస్తుందన్నారు. సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం వంటి విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9, 10, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఈ ఉత్సవ్‌లో పాల్గొంటారని చెప్పారు. వారిలో విజేతలైన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం పొందుతారనీ అన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ జీజీ మధు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి: ఎస్టీయూ



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న 11 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు సంబంధించిన 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించి నిత్యావసర ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్. గోకారి డిమాండ్ చేశారు. నగరంలోని ఎస్టీయూ భవన్‌లో సోమవారం ముఖ్య నాయకుల సమావేశం రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడు బి.సుంకన్న అధ్యక్షతన జరిగింది. గోకారి మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. పెండింగ్ కరువు భత్యాల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57 ప్రకారం 2004 కన్నా ముందు నోటిఫికేషన్ విడుదలై పరిపాలన కారణాల వల్ల తర్వాత నియమితులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి పాఠశాల సహాయకులకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. 1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 12 నెలల పూర్తి జీతం చెల్లించి దశలవారిగా వారిని రెగ్యులర్ చేయాలన్నారు. అలాగే పదవీ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు నారాయణస్వామి, ఉల్లప్ప, మధుసూదన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జీపీఎఫ్ బాధితులకు న్యాయం చేయండి

- ఉప లోకాయుక్త ఆదేశం

కర్నూలు లీగల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఖాతా నుంచి అక్రమంగా జీపీఎఫ్ మొత్తాన్ని మళ్లించుకుని స్వాహాచేసిన వ్యక్తులపై కేసుపెట్టి బాధితులకు న్యాయం చేయాలని రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని ఆదేశించారు. ఫిర్యాదిదారులైన జి.జయభారతి, డి.రామసంజన్న పదవీ విరమణ చేసిన తర్వాత జీపీఎస్ మొత్తం కోసం దరఖాస్తు చేసుకు న్నారు. జూనియర్ అసిస్టెంట్ ఏ.ప్రవేష్‌కుమార్ కొంతమంది వ్యక్తులతో కుమ్మక్కై బాధితుల జీపీఎఫ్ మొత్తాన్ని అక్రమంగా వేరే ఖాతాలకు మళ్లించుకుని దాదాపు రూ.18 లక్షలు స్వాహాచేశారు. దీంతో బాధితులు ఉప లోకాయుక్తను ఆశ్రయించారు. అక్రమా ర్కులపై విచారించి క్రిమినల్ కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని ఉప లోకాయుక్త గతంలో ఆదేశించింది. ఈమేరకు అధికారులు స్పందించి బాధితుల జీపీఎఫ్ మొత్తాన్ని 7.1 శాతం వడ్డీతో చెల్లించడానికి అంగీకరించింది. అక్రమాలకు పాల్పడిన అనంతపురంలోని హెచ్ఎల్‌సీ అప్పటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కే.వెంకట రమణారెడ్డి, ఏ.వెంకట సురేష్‌బాబు, ఉస్మాన్, సుబ్రహ్మణ్యం, ఏ.ప్రవేష్ కుమార్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు అధికారులు లోకాయుక్తకు తెలియజేశారు. భవిష్యత్తులో జీపీఎఫ్ ఉపసంహరణ, తుది చెల్లింపు చేసే ముందు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అధికారిక పోర్టల్‌లో వారి ఐడీలను వ్యక్తిగతంగా ధ్రువీకరించుకోవాలని ఉప లోకాయుక్త సూచించారు.

మల్లన్న సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి సోమవారం శ్రీశైల క్షేత్రంలో వెలసిన భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లను దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శ్రీశైల క్షేత్రంలో జేసీ ప్రభాకర్ రెడ్డి

ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేసుకోండి

- జాయింట్ కలెక్టర్ నవ్య



కౌన్సెలింగ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ నవ్య

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులపై తక్షణ చర్యలు తీసుకునేలా ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో అంతర్గత ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టంపై మిషన్ శక్తి వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రి-మార్టియల్ కౌన్సెలింగ్ సెంటర్‌పై అవగాహన కల్పించే పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించడం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల బాధ్యత అన్నారు. వివాహానికి ముందు జంటలు తమ సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి ఈ కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, ఐసీడీఎస్ పీడీ విజయ పాల్గొన్నారు.

జిల్లా అంధత్వ నియంత్రణ ప్రోగ్రాం మేనేజర్‌గా డాక్టర్ హిమబిందు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నియంత్రణ ప్రోగ్రాం మేనేజర్ (డీపీఎం)గా నంద్యాలకు చెందిన సివిల్ సర్జన్ స్పెషలిస్టు డాక్టర్ హిమబిందును నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కేటీ కృష్ణబాబు ఆదేశాలు జారీ చేశారు. నంద్యాలలో ఎన్‌పీసీపీ కింద పని చేస్తున్న హిమబిందును వైద్య కారణాలపై కర్నూలు డీబీసీఎస్‌కు బదిలీ చేస్తూ నియమించారు. గత ఐదేళ్లగా కర్నూలు డీబీసీగా పని చేస్తున్న డాక్టర్ సంధ్యారెడ్డి స్థానంలో డాక్టర్ హిమబిందు నియమితులయ్యారు.

పురోగతి పనులు ప్రజలకు కనపడాలి

- రహదారుల విస్తరణలో జాప్యం తగదు
- పార్కుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలి
- మున్సిపల్ అధికారుల సమీక్షలో మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధి పనుల్లో ఏ మాత్రం జాప్యం తగదని, ప్రజలకు ప్రత్యక్షంగా కనపడేలా ప్రగతి పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్‌శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి మున్సిపల్ అధికారులతో మంత్రి టీజీ భరత్ సమీక్ష నిర్వహించారు. ముందుగా గత సమీక్షలో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిపై చర్చించారు. బుదవారపేట మెడికల్ కాలేజీ మలుపు, కిడ్స్ వరల్డ్ కూడలి నుంచి బుదవారపేట బ్రిడ్జి వరకు రహదారివిస్తరణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే బాధితులకు పరిహారం అందించే ప్రక్రియను వేగవంతం చేసి రహదారుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వెండర్ జోన్ల ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలని, ముందుగా రెడ్ జోన్లలో ఆక్రమణలను నియంత్రించాలని సూచించారు. రాజ్‌విహార్ సమీపంలోని ఎల్లమ్మ గుడి నుంచి బుదవారపేట బ్రిడ్జి వరకు బండ్ రహదారి నిర్మాణ పనులు నిలువరించకుండా కొనసాగించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలోరహదారులపై గుర్తించిన 215 గుంతలను అత్యంత వేగంగా పూడ్చాలని ఆదేశించారు. ఎన్.క్యాప్, సీఎస్ఆర్ తదితర నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ప్రతి ప్రాంతంలో ఒక పార్కును అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని మొండి బకాయిలు విషయంలో ఎలాంటి ఉపేక్ష చూపొద్దని మంత్రి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డా.విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్వో వాజీద్, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా సీమోల్లంఘన మహోత్సవం

- ముగిసిన దీక్షలు
- పీఠాధిపతికి ఘన సన్మానం



పీఠాధిపతిని సన్మానిస్తున్న మఠం ఉద్యోగులు

మంత్రాలయం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సీమోల్లంఘన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి కొండాపురం ఆంజనేయస్వామిని దర్శించుకుని పంచ అశ్వావాహన రథంపై పీఠాధిపతి ఆసీనులై భక్తుల హర్షధ్వానాలు, భక్తిపాటలు, కోలాటాల మధ్య ఘనంగా ఊరేగారు. పీఠాధిపతి జూలై 22వ తేదీన చతుర్మాస దీక్షలు ప్రారంభించి సెప్టెంబర్ 8వ తేదీ వరకు 49 రోజుల పాటు దీక్షలు కొనసాగించారు. ఈ దీక్షల్లో 60 ఉపన్యాసాలు, 20 సంగీత కచేరీలు నిర్వహించారు. దీక్ష విరమణలో భాగంగా శ్రీమఠం ఎంప్లాయీస్ యూనియన్, విజయ విఠల్, ఎంటీఆర్, నదీతీరం షాపింగ్ కాంప్లెక్స్‌ల వారు పీఠాధిపతిని మహాముఖద్వారం నుంచి రాఘవేంద్రసర్కిల్ వరకు పూల వర్షం కురిపిస్తూ ఊరేగించారు. ఉదయం నుంచి రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేసి, మూలరాములకు కనకాభిషేకం చేసి పీఠాధిపతులు హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో పండిత కేసరి విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, మాజీ టీటీడీ బోర్డు సభ్యులు సీతారామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, పన్నగ వెంకటేశ్ స్వామి, పూజారి వ్యాసరాజాచార్, మండల కన్వీనర్ గురెడ్డి భీమిరెడ్డి, రాజాఎస్ అప్రమేయాచార్, మేనేజర్లు శ్రీపతాచార్, ఐపి నరసింహమూర్తి, డీఎం ఆనందరావు, గౌతమాచార్, ఆనందతీర్థాచార్, సుజయీంద్రా చార్, రమణారావు, వాదిరాజాచార్, ఏఈ బద్రినాథ్, హరినాథాచార్, మంచాల పద్మనాభాచార్, జేపీ స్వామి, వ్యాసరాజాచార్, హనుమేషాచార్, ప్రకాషాచార్, ద్వారపాలక అనంతస్వామి ఉన్నారు.

ఘనంగా సత్కరించి..

సీమోల్లంఘనలో భాగంగా శ్రీమఠం ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ మేనేజర్ సురేష్ కోనాపూర్, రవి కులకర్ణి, ఐపి నరసింహమూర్తి, జేపీ స్వామి, విజేంద్రాచార్ పీఠాధిపతులకు ఘనంగా సత్కరిచారు. అనంతరం పుష్పాభిషేకం చేసి పట్టువస్త్రాలు బహుకరించారు. ఈ ఊరేగింపులో టీటీడీ దాససాహిత్య భజన మండళ్లు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచారు. భక్తులనుద్దేశించి పీఠాధిపతి మాట్లాడారు. 13వ చతుర్మాసదీక్షలు రాఘవేంద్రస్వామి ఆశీస్సులతో దిగ్విజయంగా పూర్తి చేశామని, దేశ ప్రజలంతా సస్యశ్యామలంగా, సుఖశాంతులతో, ప్రశాంతంగా ఉండాలని రాఘవేంద్రస్వామికి పూజలు చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే తప్పుడు ప్రచారాలు

- వైసీపీ నాయకులపై మంత్రి భరత్ ధ్వజం



పోర్టల్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చూసి ఓర్వలేకనే వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ధ్వజమెత్తారు. నగరంలోని తనిష్క్ ఫంక్షన్ హాలులో సోమవారం పరిశ్రమల శాఖ ఏర్పాటు చేసిన సులభతర వాణిజ్య కార్యక్రమం(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)సమావేశంలో కర్నూలు, నంద్యాల కలెక్టర్లు రంజిత్‌బాషా, రాజకుమారీలతో కలిసి నిరుద్యోగులకు కేరీర్ పోర్టల్‌ను ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలకు సంబంధించి అన్ని నోటిఫికేషన్స్ అందుబాటులో ఉండేలా రూపకల్పన చేసినట్లు తెలిపారు. గతంలో పరిశ్రమల వర్గాలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పారిశ్రామిక వర్గాలకు స్వాతంత్ర్యం వచ్చిన అనుభూతి ఉందని తెలిపారు. 2018లో దావోస్‌లో అర్సలర్ మిట్టల్ కంపెనీ ఒరిస్సా రాష్ట్రానికి వెళ్లి పెట్టుబడులు పెడతామని చెప్పారని, ప్రస్తుతం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చొరవ వల్ల మిట్టల్ కంపెనీ రాష్ట్రానికి వస్తోందని చెప్పారు. గత టీడీపీ హయాంలో జయరాజ్ ఇస్పాత్ పరిశ్రమకు భూమి పూజ చేయగా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామంటే వైసీపీ నాయకులు తట్టుకోలేకపోతున్నారన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా జగన్ పత్రికలో పారిశ్రామికవేత్తలకు భూకేటాయింపులపై ఇష్టానుసారంగా వార్తలు రాస్తున్నారని, 15 నెలల్లో రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌తోనే ఇది సాధ్యమైందని అన్నారు. వైసీప హయాంలో పారిశ్రామికవేత్తలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారన్నారు. ఆలీప్ కంపెనీ ద్వారా ఎన్నో వేల మందికి ఉద్యోగాలు దక్కాయని, ఇవేమి పట్టించుకోకుండా పని కట్టుకొని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తులు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహ బాలసదరంలో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ పద్దతిలో ఖాళీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.విజయ ఓ ప్రకటనలో తెలిపారు. శిశు గృహంలో ఖాళీగా ఉన్న కాంట్రాక్టు పద్దతిలో సోషల్‌వర్కర్ కమ్ ఎర్లీ చైల్డ్ హెడ్ కం ఎడ్యుకేట్ (1), ఆయా-2 (ఈడబ్ల్యూఎస్-1, ఓసీ(డబ్లూ)-1) పత్తికొండ బాలసదరంలో ఔట్ సోర్సింగ్ పద్దతిలో కుక్-1 (ఈడబ్ల్యూఎస్-1- ఓసీ-డబ్లూ), వెల్ఫేర్ కమ్ నైట్ వాచ్‌మెన్ -1 (ఎస్సీ డబ్లూ), పార్ట్‌టైం పద్దతిలో ఎడ్యుకేట్-1 (ఓసీ డబ్లూ), ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కమ్ మ్యూజికల్ టీచర్-1 (ఎస్సీ డబ్లూ), ఇన్‌స్పెక్టర్ కమ్ యోగా టీచర్-1 (ఓసీ డబ్లూ) బాలసదరం పెద్దపాడులో ఇన్‌స్పెక్టర్ కమ్ యయోగా టీచర్-1 (ఎస్సీ-డబ్లూ) (పార్ట్ టైం) నియామకాల కొరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వికలాంగుల అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుందన్నారు. అభ్యర్థులు ఈ నెల 9 నుంచి 17వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కలెక్టరేట్‌లోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాయలం రూం.నెం.122లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. వివరాల కోసం కర్నూలు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌ను గానీ, కార్యాలయంలో నోటీసు బోర్డును పరిశీలించాలని కోరారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు అవార్డులు



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయినులు

పాణ్యం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పాణ్యం మోడల్ పాఠశాల ఉపాధ్యాయులకు నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఇండియా గ్లోబల్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ మెమోరియల్ ఎక్సలెన్సీ అవార్డులు అందుకున్నారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ దినేష్‌బాబు మాట్లాడుతూ ఈనెల 7 తేదీన కర్నూలులో నిర్వహించిన కార్యక్రమంలో తనతో పాటు బోటనీ ఉపాధ్యాయిని భారతి, ఎకనామిక్స్ ఉపాధ్యాయిని పర్వానా అవార్డులు అందుకున్నారని చెప్పారు. చదువు, సాంస్కృతిక, క్రీడలు, స్కౌట్, గైడ్స్ తదితర కార్యక్రమాలలో చేసిన సేవలకు అవార్డులు దక్కినట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఇండియా గ్లోబల్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాయపాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి



మాట్లాడుతున్న వరలక్ష్మి

కల్లూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని, సంవృద్ధిగా నిల్వలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి వీఎల్ వరలక్ష్మి తెలిపారు. సోమవారం కల్లూరు మండలం పర్ల గ్రామంలో సిటిజన్ ఔట్రిచ్ ప్రోగ్రాం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.శ్రీవర్ధన్‌రెడ్డి, కల్లూరు వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, డీఆర్సీ వెంకటరెడ్డి పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి మాట్లాడుతూ యూరియా, నానో యూరియా మధ్య వ్యత్యాసాలను ప్రజలకు వివరించారు. అనంతరం రైతులకు పొలం పిలు స్తోంది, పొలంబడి , ఈ-క్రాఫ్ బుకింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు.

మహిళలు ఉద్యమించాలి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న అరాచకాలపై ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి నిర్మల పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఈశ్వర్‌రెడ్డి భవన్‌లో సమావేశం నిర్వహించారు. మహిళలపై రోజురోజుకూ అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మహిళలు పోరాటాలకు నడుం బిగించాలన్నారు. సీఐటీయూ నాయకుడు గౌస్‌దేశాయ్ ఉన్నారు. అనంతరం పత్తికొండ ఐద్వా మండల అధ్యక్షురాలిగా అంజినమ్మ, ఉపాధ్యక్షురలిగా జైలమ్మ, ఉమా మహేశ్వరి, కార్యదర్శిగా కృష్ణవేణి, సహాయ కార్యదర్శులు గా పావని, లలితను ఎన్నుకున్నారు.

యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఇక్కడ చదివి ఉద్యోగాలు సాధించడం అభినందనీయం
- జేసీ డాక్టర్ బి.నవ్య



జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్యతో సత్కారం పొందిన యువ ఉద్యోగులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాశ్ ఆధ్వర్యంలో గ్రంథాలయంలో చదువుకొని ఉపాధ్యాయ, గ్రూప్స్‌లో ఉద్యోగాలు సాధించిన యువతను ఆమె ప్రశంసించారు. శాలువాలతో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ యువత నిత్యం గ్రంథాలయానికి వచ్చి, ఇక్కడ అందుబాటులో ఉన్న పోటీపరీక్షల పుస్తకాలు చదివి ఉద్యోగాలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు వీరిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్క విద్యావంతులైన యువత గ్రంథాలయానికి రావాలన్నారు. లైబ్రరీలో వివిధ విభాగాలను ఆమె పరిశీలించారు. అందుబాటులో ఉన్న పుస్తకాలు, పాఠకుల సంఖ్య, పోటీ పరీక్షల పుస్తకాల వివరాలు, పుస్తకాల కంప్యూటరీకరణ అంశాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. నిరుద్యోగ యువత చదువు కునేందుకు అన్నిరకాల పుస్తకాలు అం దుబాటులో ఉంచిన గ్రంథాలయ కార్యదర్శి కె. ప్రకాశ్, ఉద్యోగులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డి, లైబ్రేరియన్లు ఎస్ బాషా, పద్మావతమ్మ, నసీమాబీ, రేణుక, ఉప, కార్యాలయ సిబ్బంది ఎస్ మగ్బుల్ బాషా, సుదర్శనం, రాజు, నాగభాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాణ్యం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి యోగా పోటీలకు పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి నాగకార్తీక్ ఎంపికైనట్లు హెచ్ఎం రాములునాయక్ తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈనెల 6, 7 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో నాగకార్తీక్ పాల్గొన్నాడు. రాష్ట్రస్థాయిలో ఐదోవ స్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని, యోగా మాస్టారు ప్రతాపరెడ్డిని ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, పవన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ జట్ల ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రీడాకారుల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అధ్యక్షులు డీవీఈవో సురేష్‌బాబు, ఆర్‌ఐవో లాలెప్ప సోమవారం తెలిపారు. 10న అర్చరీ, షూట్కా, సెపక్‌తక్రా డీఎస్‌ఏ అవుట్‌డోర్ స్టేడియంలో, 11న ఫుట్‌బాల్ ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 12న ఫెన్సింగ్, కురాష్, ఉషూ కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 15న జూడో, కలియరపట్టు, నెట్‌బాల్ కర్నూలు డీఎస్‌ఏ అవుట్‌డోర్ స్టేడియంలో, రైఫిల్ షూటింగ్‌ను కర్నూలు నగరంలో అశోక్ నగర్‌లో ఆర్‌కే అకాడమీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2007 జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారు పదో తరగతి మార్కుల జాబితాతో ఎంపికలో నేరుగా హాజరు కావచ్చని తెలిపారు. వివరాల కోసం రాఘవేంద్ర 9440864732ను సంప్రదించాలని సూచించారు.

విచారించి న్యాయం చేస్తాం: ఎస్పీ



ఫిర్యాదులు వింటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులన్నింటినీ విచారించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. నగరంలోని కొత్తపేటలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 99 ఫిర్యాదులు వచ్చాయి. డీఎస్పీ బాబుప్రసాద్, సీఐలు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు

- క్రిష్ణగిరి మండలం కటారుకొండ దగ్గర ఉన్న పులిచెర్లలో ఉన్న 11 ఎకరాల పొలాన్ని ఆక్రమించుకోవాలని పులిచెర్లకు చెందిన దాసరి మధు బెదిరింపులకు పాల్పడుతున్నాడని మంత్రాలయం మండలం చిలకలడోన గ్రామానికి చెందిన మహేశ్ ఫిర్యాదు చేశారు

అనంతపురానికి చెందిన జయచంద్ర బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ ఉద్యోగం గానీ, లోన్ గానీ ఇప్పిస్తామని చెప్పి రూ.లక్ష తీసుకుని మోసం చేశారని కర్నూలుకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. తన మొబైల్‌కు పీఎం కిసాన్ పేరుతో ఏపీకే ఫైల్ వచ్చిందని, తన ఫెడరల్ బ్యాంకు ఖాతా నుంచి రూ.55వేలు, యూనియన్ బ్యాంకు ఖాతా నుంచి రూ.10వేలు మాయం చేశారని కల్లూరు మండలానికి సూర్యనారాయణ ఫిర్యాదు చేశారు. కోడుమూరు రోడ్డులో ఉన్న 18 సెంట్ల స్థలాన్ని మురళీమోహన్, కాంట్రాక్టర్ జాన్ కబ్జా చేశారని, చర్యలు తీసుకోవాలని కర్నూలు షరాఫ్ బజార్‌కు చెందిన వెంకట నారాయణ ఫిర్యాదు చేశారు. ఓ వ్యక్తి తన ఇంటిని ఖాళీ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆర్మీలో పని చేస్తూ రిటైర్డు అయిన కర్నూలు మహాలక్ష్మి నగర్ చెందిన జయరామిరెడ్డి ఫిర్యాదు చేశారు. తన ఇల్లు 5 నెలలుగా ఖాళీగా ఉంచానని, తన కుమారుడు ఆర్మీలో పని చేస్తుండడంతో అక్కడికి వెళ్లానని చెప్పాడు. తన ఇంటిలోకి ఓ వ్యక్తి చేరి నివాసం ఉంటూ ఖాళీ చేయడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఓపిక పోతోంది!



వేచిచూసి ఆకలవుతోంది, టిఫిన్ చేద్దాం... ఆసుపత్రిలో రోగులు వారి సహాయకులు



దండం సారూ త్వరగా చేయండి.. స్కానింగ్ కేంద్రం వద్ద పడిగాపులు

- విజృంభిస్తున్న జ్వరాలు
- సర్వజన ఆసుప్రతిలో కిక్కిరిసిన రోగులు
- ఒక్క రోజులోనే 3,291 మందికి ఓపీ

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కిటకిటలాడుతోంది. జ్వరాలు, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలతో ఆసుపత్రికి రోగులు బారులుదీరుతు న్నారు. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో వైరల్ జ్వరంతో ప్రజలు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో కర్నూలు జీజీహెచ్ రోగులతో కిక్కిరిసింది. సోమవారం ఓపీకి రికార్డు స్థాయిలో 3,291 మంది (రాత్రి 9 గంటలకు) రాగా, ఇందులో 412 మంది మెడికల్ ఓపీకి, చిన్నపిల్లల ఓపీకి 310 వచ్చారు. ఇందులో మెడికల్ విభాగంలో 56 మంది అడ్మిషన్ పొందగా.. పీడీయాట్రిక్‌లో 60 మంది చిన్న పిల్లలు అడ్మిషన్ పొందారు.

ఉదయం ఓపీ కోసం రోగులు ఆగచాట్లు పడ్డారు. ఓపీ టికెట్ ఇస్తే చాలు వైద్యం అందినట్లేనని కొందరు రోగులు చెప్పడం విశేషం. మేల్ ఓపీ రోగలుకు ఓపీ సులభంగా లభించినప్పటికీ మహిళా రోగులు మాత్రం ఉదయం 11 గంటలైనా ఓపీ చీటీలు దొరకని పరిస్థితి నెలకొంది. వైద్యాధికారుల నిర్లక్ష్యంతో ఓపీ వద్ద మహిళా రోగులు, వృద్దులు ఇబ్బందులు పడ్డారు. జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో సాయంత్రం 5 గంటల వరకు కూడా ఆసుపత్రికి రోగులు వస్తున్నారు.



క్యూలో నిల్చోక తప్పదు మరి.. పరీక్షల రిపోర్టుల కోసం వేచి ఉన్న రోగులు



గందరగోళం.. ఇంతమందిలో మన వంతు ఎప్పుడో..

ఉల్లి రైతులను ఆదుకోండి



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

(5వ పేజీ తరువాయి)

అక్కడి నుంచి హోటల్‌కు చేరుకున్నారు. అక్కడ ఏఐసీసీ సభ్యుడు జె.లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ సిటీ అధ్యక్షుడు షేక్ జిలానిబాషా తో సహా పలువురు ముఖ్యనాయకులతో మాట్లాడారు. కర్నూలు డీసీసీ కార్యాలయ వివాదంలో తొలగించబడిన ఆఫీసు సిబ్బంది తమను విధుల్లో తీసుకోవాలని షర్మిలను విన్నవించారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు వైఎస్ షర్మిల, వైఎస్ రాజారెడ్డితో కలిసి ఫొటోలు దిగారు. అనంతరం ఆమె హైదరాబాద్‌కు బయలుదేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, కర్నూలు సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానిబాషా, అసెంబ్లీ నియోజకవర్గాల కోఆర్డినేటర్లు ఎం.ఖాశీంవలి, బి.క్రాంతినాయుడు, మురళీకృష్ణ రాజు, రమేశ్‌యాదవ్, అనంతరత్నం మాదిగ, పుల్లయ్య, గార్లపాటి మద్దిలేటి, తేనే నాగరాజు, బాలు యాదవ్, పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శులు దామోదరం రాధాకృష్ణ, చింతల మోహన్ రావు యాదవ్, ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఖాద్రీపాషా, కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మారుతిరావు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగి మెరుగైన సేవలందించండి

(5వ పేజీ తరువాయి)

. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు ఏర్పడినప్పుడు వెంటనే తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ పునరుద్ధరణకు అవసరమైన ఏర్పాట్లను తాము అందించగలమన్నారు.

సూర్యఘర్ కీలక పాత్ర

సంప్రదాయ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా సూర్యఘర్ కీలక పాత్ర వహించనుందన్నారు. రాబోయే తరం సూర్యఘర్‌తోనే సాకారం అవుతుందన్నారు. సూర్యఘర్ ప్రజలను చేరువచేసేందుకు ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత ఉద్యోగులదే అన్నారు. ప్రతి ఉద్యోగి తమవంతు ఆదర్శంగా సూర్యఘర్ ఏర్పాటుచేసుకోవాలన్నారు. ఆరేళ్లలో ఉచిత విద్యుత్ పొందగలరని వినియోగదారులకు సూచించాలన్నారు. విద్యుత్ పంపిణీలో వినియోగదారుల సంతృప్తి ఇంకా మెరుగుపరుచుకోవాలని సూచించారు. విద్యుత్ పంపిణీలో వినియోగా దారులకు జరుగుతున్న అసౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు సాధన దిశలో పరిష్కారం చేస్తే నూటికి నూరు శాతం ప్రభుత్వం ఆశించినట్లుగా విద్యుత్ శాఖ సేవలందించినట్లేనని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడిసియల్ డైరక్టర్ గురువయ్య, నంద్యాల జిల్లా విద్యుత్‌శాఖ డీఈలు, ఏడీలు, ఎఈఈలు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- రాష్ట్ర విద్యుత్ శాఖ డైరెక్టర్ గురువయ్య

పాణ్యం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సిబ్బంది సాంకేతిక సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలని రాష్ట్ర విద్యుత్ సాంకేతిక శాఖ డైరెక్టర్ గురువయ్య ఆదేశించారు. సోమవారం ఆయన పాణ్యం విద్యుత్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గురువయ్య మాట్లాడుతూ వ్యవసాయానికి నిరంతరం తొమ్మిది గంటల విద్యుత్‌ను అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ కోతలను అరికట్టాలన్నారు. ఇందుకు అవసరమైన సాంకేతిక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు, లోవోల్టేజీ సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. విద్యుత్ సామగ్రిని, నిల్వ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ మధుసూదన్, ప్రసాదరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ పరికరాలు పరిశీలిస్తున్న డైరెక్టర్ గురువయ్య

విద్యార్థికి అండగా...

- తానా బోర్డు డైరెక్టర్ పొట్లూరి రవి చేయూత

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ పొట్లూరి రవి కర్నూలు జిల్లాలోని కప్పట్రాళ్ల గ్రామ అభివృద్ధికి, విద్యార్థుల చదువులకు సహాయం అందిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన విద్యార్థి కె. ఈరన్న ఇంటర్మీడియట్ విద్యాభ్యాసానికి పొట్లూరి రవి రూ.1.50 లక్షల సాయం అందించి కర్నూలులోని మోషన్ రెసిడెన్షియల్ కళాశాల్లో చదివిస్తున్నారు. పొట్లూరి రవి ప్రోత్సాహంతో ఈరన్న ఇంటర్మీడియట్ బైపీసీ మొదటి సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి 440 మార్కులకు గాను 425 మార్కులు సాధించాడు. ఈరన్న చదువులో రాణించడంపై పొట్లూరి రవి సంతోషం వ్యక్తం చేస్తూ అభినందించారు. కప్పట్రాళ్ల గ్రామంలో పదో తరగతిలో టాపర్‌గా వచ్చిన ఈరన్న ఇంటర్మీడియట్ చదువుకు ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించారు. ఈరన్న మాట్లాడుతూ పొట్లూరి రవి సహాయం మరువలేనిదని, తనలాంటి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఆయన ఇస్తున్న ప్రోత్సాహానికి ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ కావాలన్నది తన కోరిక అని, కష్టపడి చదువుకుని మెడికల్ సీటు సాధించడానికి కృషి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడానికి తనవంతుగా కృషి చేస్తూనే ఉంటానని, సహకరిస్తున్న తానా ఫౌండేషన్ వల్లేపల్లి శశికాంత్‌కు ఈ సందర్భంగా రవి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా విద్యార్థి ఈరన్నను మోషన్ రెసిడెన్సియల్ కళాశాల కరస్పాండెంట్ విజయ్, ముప్పా రాజశేఖర్ తదితరులు అభినందించారు.



పొట్లూరి రవితో కప్పట్రాళ్ల విద్యార్థి ఈరన్న

భర్త హత్యకేసులో భార్య, ప్రియుడు అరెస్టు

ఆస్పరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రియుడి మోజులో పడి భర్తను హత్య చేసిన కేసులో భార్య, ప్రియుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. వివరాలు.. మండలంలోని తొగల్‌గల్ గ్రామానికి చెందిన గొల్ల అహోబిలం, గొల్ల గంగావతి భార్యాభర్తలు. వీరికి ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. ఒక కొడుకు, కుమార్తె ఉంది. జీవనోపాధి కోసం కర్ణాటకలోని యాదగిరి జిల్లా రత్నడిగి గ్రామానికి వలసవెళ్లారు. అక్కడ చెన్నబసవ అనే వ్యక్తితో గొల్ల గంగావతికి తొమ్మిది నెలల క్రితం పరిచయం ఏర్పడింది. వారిద్దరి మధ్య ప్రేమ వ్యవహారం కొనసాగింది. గంగావతి భర్తను కడతేర్చేందుకు సిద్ధమైంది. ప్రియుడి మోజులో పడి కట్టుకున్న భర్తనే కడతేర్చేందుకు నిర్ణయం తీసుకుంది. ఈనెల 3వ తేదీన దొడగొండ-తొగల్‌గల్ గ్రామాల మధ్య ప్రియుడితో కలిసి హత్య చేయించినట్లు విచారణలో తేలింది. అహోబిలం హత్య కేసులో నిందితులైన భార్య గంగావతి, ప్రియుడు చెన్నబసవను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



నిందితుల అరెస్టును చూపుతున్న సీఐ గంగాధర్, పోలీసులు

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): శిరివెళ్ల మండలం కోటపాడు గ్రామానికి చెందిన రాగిపోగుల నారాయణకు సోమవారం ఆళ్లగడ్డ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలివీ.. శిరివెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో గ్రామానికి చెందిన నడిపి ఓబులేసు తన స్నేహితులతో కలసి కాలక్షేపం కోసం గ్రామంలోని లింగమయ్య అరుగుపై మాట్లాడుతుండగా అదే గ్రామానికి చెందిన నారాయణ పాత మనస్పర్థలు మనసులో ఉంచుకొని కత్తితో హత్యాయత్నం చేశాడు. ఈ మేరకు అప్పట్లో పోలీసు అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ శివప్రసాద్‌రావు కోర్టులో వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో నారాయణకు శిక్ష విధించారు.

ఇంటర్మీడియట్ విద్యార్థి బలవన్మరణం

- హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక ఉరివేసుకున్న స్టూడెంట్





రోదిస్తున్న కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్లో శ్యాంసుందర్ (ఫైల్)

డోన్ టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక.. ఒంటరితనానికి గురైన ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాదకరమైన ఘటన పట్టణంలోని బీసీ హాస్టల్‌లో సోమవారం ఉదయం జరిగింది. వివరాలివీ.. అనంతపురం జిల్లా యాడికి మండలం చౌడేశ్వరి కాలనీకి చెందిన సావిత్రి, రమేశ్ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు శ్యాం సుందర్ డోన్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సం చదువుతున్నాడు. శ్యాంసుందర్ ఒంటరి స్వభా వంతో బాధపడేవాడు. రెండు నెలల క్రితమే హాస్టల్‌లో చేరాడు. తన భావాలను స్నేహితులతో పంచుకునేవాడు కాదు. సోమవారం ఉదయం వసతి గృహంలోని బాత్రూంలో ఉరివేసుకు న్నాడు. ఈ ఘటనతో విద్యార్థులు, కుటుంబ సభ్యులు శోకసంద్రం లో మునిగిపోయారు. అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా హాస్టల్‌కు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామానికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎఫ్ఎస్ఎల్ టీమ్ కర్నూలు నుంచి వచ్చి ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరాల ఫుటేజీలో అతను ఒంటరిగా బాత్రూమ్‌లో వెళ్లి అక్కడే ఉరి వేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోందని సీఐ తెలిపారు.

విధుల్లో వార్డెన్ నిర్లక్ష్యం: బీజేపీ

హాస్టల్ వార్డెన్ విధుల్లో నిర్లక్ష్యం వహించారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి, బీజేపీ నాయకులు ఆర్మీ రామయ్య, నాగార్జున, ముదిరాజ్ లక్ష్మీనారాయణ ఆరోపించారు. సోమవారం స్థానిక పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ హాస్టల్‌లో వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో కనీసం వాచ్‌మెన్ కూడా లేకపోవడం దారుణమన్నారు. ఇలా విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వార్డెన్‌పై, మండల విద్యాధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేసి ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

- పరారీలో మరో ఇద్దరు..
- మూడు కత్తులు, బైక్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాబుప్రసాద్, పోలీసులు

కర్నూలు క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బంగారు వ్యాపారి షేక్ ఇజహర్ అహ్మద్ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ బాబుప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన సీఐ పార్థసారథితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. రాధాకృష్ణ థియేటర్ సమీపంలో ఈనెల 1వ తేదీన సాయంత్రం 7గంటలకు ఇజహర్ అహ్మద్ తన తండ్రి నిసార్ అహ్మద్‌తో కలిసి నమాజుకు వెళ్లాడు. మసీదు నుంచి బయటకు రాగానే వన్‌టౌన్ గనిగల్లీకి చెందిన ఇమ్రాన్, ఇర్ఫాన్, షేక్ జాహీన్ అహ్మద్ ఆలియాస్ జహంగీర్, ఎస్ఎండీ ఇర్ఫాజ్, యూసుఫ్‌తో కలిసి దాడి చేశారు. పాత గొడవలు, మనస్పర్థలు ఏర్పడటంతోనే ఇజహర్ అహ్మద్‌ను హత్య చేయాలనే పథకంలో భాగంగా దాడిచేసి కత్తులతో గాయపరిచారు. ఇజహార్‌ను కర్నూలు ప్రభుత్వ ఆసు పత్రికి తరలించగా అదే రోజు రాత్రి 8 గంటలకు మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఇమ్రాన్, ఇర్ఫాన్, షేక్ జాహీన్ అహ్మద్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, త్వరలో పట్టుకుంటామన్నారు. నిందితుల నుంచి నేరానికి ఉపయోగించిన మూడు కత్తులను, బైక్‌ను స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో పీసీఆర్ సీఐ శివశంకర్, వన్‌టౌన్ ఎస్ఐ తిమ్మారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

బరితెగించిన దుండగులు

- అంగన్‌వాడీ కేంద్రంలో బేడలు, నూనె చోరీ.. కోడిగుడ్లు ధ్వంసం

ఆస్పరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దుండగులు బరితెగించారు. ఆస్పరిలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో చోరీకి పాల్పడ్డారు. వివరాల మేరకు.. ఆదివారం రాత్రి తాళాలు పగలగొట్టి 26 కేజీల బేడలు, 7 లీటర్ల మంచినూనె ప్యాకెట్లను దొంగిలించి, కోడిగుడ్లను ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం గమనించిన టీచర్ నాగేంద్రమ్మ, ఐసీడీఎస్ జూనియర్ అసిస్టెంట్ రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా టీచర్లలో మనస్పర్థలు ఉండ టంతో ఇలా జరిగి ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు.



దుండగులు ధ్వంసం చేసిన గుడ్లు

వైసీపీ నేతలవి మొసలి కన్నీరు

- రైతులకు అండగా కూటమి ప్రభుత్వం
- కర్నూలు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ అజ్మత్‌బీ

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతుల విషయంలో వైసీపీ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని కర్నూలు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ అజ్మత్‌బీ విమర్శించారు. సోమవారం కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వైస్ చైర్మన్ శేషగిరిశెట్టితో కలిసి ఆమె మాట్లాడారు. వైసీపీ పాలనలో మద్దతు ధర కోసం రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు అండగా నిలిచిందన్నారు. రైతుల మనసులో విషం నింపే కుట్రలు వైసీపీ నాయకులు చేయడం దారుణమన్నారు. ఇటీవల తమ అనుచరులకు రైతుల ముసుగు వేసి కర్నూలు మార్కెట్ యార్డు వద్ద ధర్నా చేశారనీ, లేని ఆత్మహత్యాయత్నాలను సృష్టించారని ఆరోపించారు. మార్కెట్ యార్డుకు రైతులు తెచ్చిన ఉల్లిని ఎప్పటికప్పుడు మార్క్‌ఫెడ్, వ్యాపారులతో కొనుగోలు చేయిస్తున్నామన్నారు. క్వింటానికి రూ.1,200 మద్దతు ధర అందించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని అన్నారు.ఉల్లి రైతులు సంతోషంగా ఉంటే వైసీపీ నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా జత కలిపి తమ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోయడం సరైంది కాదన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అజ్మత్‌బీ

దొంగల అరెస్టు

- రూ.9.90 లక్షల విలువైన కేబుల్ వైర్లు స్వాధీనం

సంజామల, సెపెంబరు 8(ఆంధ్రజ్యోతి): రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద అపహరణకు గురైన కేబుల్‌ను సంజామల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత నెల 23న రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించి రైల్వే లైన్ దగ్గర 420 కేజీల రాగి వైరు అపహరణకు గురైనట్లు ఎలక్ట్రికల్ మేనేజర్ జి.కృష్ణమూర్తి సంజామల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ రమణయ్య సిబ్బందితో ముమ్మర గాలింపు చేపట్టి దొంగలను పట్టుకున్నారు. 210 కేజీలు రూ.5.50 లక్షల విలువ చేసే రాగి వైరు, మరో 210 కేజీలు రూ. 4.40 లక్షలు విలువ చేసే 6.5 ఎస్క్యూఎంఎం వైర్లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు: జేడీఏ

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణా దారులు యూరియా కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ పీఎల్ వరలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని ఏడీఏ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జేడీఏ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియాను అందజేస్తున్నట్లు తెలిపారు. ఎరువుల దుకాణాదారులు యూరియాను రైతులకు ఎమ్మార్పీకే అందజేయాలని, అధిక ధరలకు విక్రయించినా, యూరియాతో పాటు ఇతర ఎరువులను తీసుకోవాలని ఆదేశించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో 48,992 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. కొరత ఉంటే రైతులు టోల్ ఫ్రీ నెంబర్ 8341302863లో సంప్రదించాలని సూచించారు.

స్పందించిన సబ్ కలెక్టర్

మండలంలోని గుడికల్లు గ్రామంలో యూరియా కోసం రైతుల ఇబ్బందులపై సోమవారం ఆంధ్రజ్యోతిలో 'యూరియాతన' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ గుడికల్లు గ్రామంలోని రైతుభరోసా కేంద్రానికి ఏవో శివశంకర్, ఏఈవో నరసింహులు, ఆర్ఐ హఫీజ్‌ను పంపి విచారణ చేపట్టారు. రైతు గోవిందును తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి సబ్‌కెక్టర్‌తో మాట్లాడించినట్లు తహసీల్దార్ శేషఫణి తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ యూరియా పంపిణీలో అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. స్థానిక వ్యవసాయ అధికారులే యూరియాను కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారని రైతులు చెబుతున్నారని అడగగా.. ఈ విషయంపై సబ్‌కలెక్టర్ విచారణ చేపడతారని చెప్పారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాక్రిష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాధాక్రిష్ణ మాట్లాడుతూ ఉచిత బస్సులతో ఆటోలను నమ్ముకుని జీవిస్తున్న డ్రైవర్లకు ఇబ్బంది కలుగుతుందన్నారు. జీవో నెంబరు 21ని రద్దు చేసి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 18న జరిగే చలో విజయవాడను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్, సహాయ కార్యదర్శి మహమూద్, నగేష్, నరసింహులు, హుస్సేన్ వలి, డి.కుమార్ పాల్గొన్నారు.

ఈడిగ కులస్థులను ప్రత్యేకంగా లెక్కించాలి


జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఈడిగ గౌడ సంఘం నాయకులు

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కులగణనలో ఈడిగలను ప్రత్యేకంగా లెక్కించాలని, ప్రభుత్వ వెబ్‌సైట్‌లో గౌడ (ఈడిగ) కాకుండా, ఈడిగ అని మార్చి రాయితీలు కోల్పోకుండా చూడాలని జిల్లా ఈడిగ, గౌడ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు కాసాని మహేష్ గౌడు, ప్రధాన కార్యదర్శి సురేష్ గౌడు, రామకృష్ణ గౌడు కోరారు. సోమవారం వారు జాయింట్ కలెక్టర్ నవ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో.నెం.16 ప్రకారం ఈడిగ, గౌడ, శెట్టి బలిజ, యాత కులాలను సర్దార్ గౌతు లచ్చన్నపై అన్నింటిని కలిపి ఒక గొడుగు కిందకు తీసుకువచ్చి గీత కులాల కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ ఐదు కులాలను కలిపి గీత కులాలుగా గుర్తించారన్నారు. కానీ అనేక విషయాల్లో ఈడిగ కులస్థులు వివక్షకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి గౌడు, నరేష్ గౌడు పాల్గొన్నారు.

ల్యాప్రోస్కోపిక్‌తో కిడ్నీలో రాళ్ల తొలగింపు



రోగితో యురాలజిస్టు డాక్టర్ అబ్దుల్ సమద్

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఓ మహిళకు కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌లో రెండు దశల్లో కిడ్నీ రాళ్లను యురాలజిస్టు డాక్టర్ అబ్దుల్ సమద్ ల్యాప్రో స్కోపిక్ పద్ధతి ద్వారా తొలగించారు. 57 ఏళ్ల సుజాత నడుము నుంచి లాంబర్ ప్రాంతానికి వ్యాపించే తీవ్రమైన కడుపు నొప్పితో జూన్ 8న మెడికవర్ ఆస్పత్రికి వచ్చారు. యురాలజిస్టు డాక్టర్ అబ్దుల్ సమద్ సిటీ స్కాన్ తీయగా ఆమెకు కుడివైపున పూర్తి స్టాగ్ హార్న్ కేల్కులస్ కిడ్నీ స్టోన్స్ 5.1 సెం.మీటర్ల అప్పర్‌పోల్ కేల్కులస్ 1.6 సెం.మీటర్లుగా ఉన్నట్లు గుర్తించారు. వెంటనే రోగికి చికిత్స నిర్వహించి రాళ్లను తొలగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హాస్పిటల్ కర్నూలు క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాయలసీమలోనే మొట్టమొదటి సారిగా పెద్ద స్టాగ్‌హార్న్ కేల్కులస్ కిడ్నీ రాళ్లను స్టేజల వారీగా సురక్షితంగా తొలగించారన్నారు.

కో ఆర్డినేటర్‌కు సన్మానం

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా బీఆర్ అంబేడ్కర్ గురుకులాల కో-ఆర్డినేటర్ ఐ.శ్రీదేవిని ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు గోన నాగరాజు, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్ శాలువ కప్పి సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 30 మంది విద్యార్థులు నీట్, ఎన్ఐటీకి ఎంపిక కావడం విశేషమన్నారు. ఇంటర్, పదో తరగతి పరీక్ష ఫలితాలతోపాటు రాష్ట్ర స్థాయి 3, 5 ర్యాంకులు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. కార్యక్ర మంలో రాజ్‌కుమార్, నాగేంద్ర, నారాయణ పాల్గొన్నారు.

పేదల గుడిసెలకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలి


అధికారికి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బి.తాండ్రపాడు గ్రామంలో పేదలు వేసుకున్న గుడిసెలకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు డివిజన్ విద్యుత్ కార్యాలయం ముందు నగర కార్యదర్శి మహేష్ అధ్యక్షతన ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్లుగా 600 మంది పేదలు గుడిసెలు వేసుకుని కాపురాలు చేస్తున్నారని, వారందరికీ విద్యుత్ మీటర్లు ఇవ్వాలని అన్నారు. అనంతరం కర్నూలు ఈఆర్‌ఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మనోహర్ మాణిక్యం, నాగరాజు, గిడ్డమ్మ పాల్గొన్నారు.

బస్సుల కోసం విద్యార్థుల ఆందోళన

పగిడ్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలల సమాయానికి బస్సులు నడపాలని మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన విద్యార్థులు సోమవారం బస్సులు నిలిపి వేసి ఆందోళన చేపట్టారు. బస్సులు సమాయనికి రాకపో వడంతో కళాశాలలు, పాఠశాలకు ఆలస్యమవుతోందన్నారు. ఆర్టీసీ అధికారు లు ఇక్కడికి వచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదని విద్యా ర్థులు పట్టుబట్టారు. దీంతో సుమారు గంటకు పైగా వాహ నాలను అడ్డుకున్నారు. ముచ్చుమర్రి ఏఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడతామని పేర్కొనడంతో ఆందోళన విరమించారు.

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి

నగర పాలక కమిషనర్ విశ్వనాథ్


కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను నిర్దీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన అర్జీలను కమిషనర్ స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ టిడ్కో గృహాలకు సంబంధించి వస్తున్న ఫిర్యాదులపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్‌రెడ్డి, ఆర్‌ఓ జునైద్, టీపీఆర్‌ఓ శ్రీనివాసులు, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

● రాత్రివేళ పారిశుధ్య పనుల్లో మహిళా కార్మికులకు మినహాయింపు ఇవ్వాలని జనవాహని పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసులు కమిషనర్ పి.విశ్వనాథ్‌కు వినతి పత్రం అందజేశారు.

● స్థానిక 11వ వార్డులో వేసిన నాసిరకం రోడ్డుపై విచారణ జరిపించాలని సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా వార్డు ఇన్‌చార్జి జహంగీర్ అమ్మద్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. నెహ్రూ రోడ్డులో నిర్మించిన సిమెంటు రహదారి ఒక నెలలోపే దెబ్బతిందన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ మహ్మద్, ఆకీబ్ పాల్గొన్నారు.

● బుధవారపేట హిందూ స్మశాన వాటికలో కంపచెట్లను తొలగించాలని సీపీఎం నగర కార్యదర్శి రాజశేఖర్ కోరారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.

● బాబుజగ్జీవన్‌రామ్ నగర్‌లో ప్రభుత్వ మరుగుదొడ్లను నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ సెల్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రరెడ్డి కోరారు. కమిషనర్‌కు స్థానికులతో కలిపి వినతి పత్రం అందజేశారు.

పీపీపీ విధానం అమలు చేస్తే పోరాటం



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పీపీపీ విధానంతో విద్యార్థులకు నష్టం జరుగుతుందని, ఈ విధానం అమలు చేస్తే పోరా టాలకు సిద్ధమవుతామని ఏఐఎస్ఎఫ్ జిల్లా శాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు ఆందోళన లు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం మంత్రి వర్గ సమావేశంలో వైద్య రంగంలో సమూళ్ల మార్పుకు శ్రీకారం చుట్టిందని పీపీపీ విధానంలో ప్రతిభ ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీ విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలనే నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు రవి, అశోక్, నగర ఉపాధ్యక్షులు వరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకుంటోంది

కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులను ప్రభు త్వం ఆదుకుంటోందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. సోమవారం కర్నూలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలకల్ గ్రామానికి చెందిన ఇద్దరు వైసీపీ కార్యకర్తలు కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ఖాళీ పురుగుల మందు డబ్బాలో మద్యం కలుపుకొని తాగి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ సెల్ఫీ వీడియో విడుదల చేశారని వివరించారు. వైసీపీ కుట్రపూరితంగా తప్పుడు సమాచారంతో ఆ పార్టీ కార్యకర్తలతో నాటకాలు ఆడించి మరీ సోషల్ మీడియాలో వైరల్ చేసిందని ఆరోపించారు. వాస్తవానికి ఆ పార్టీకి చెందిన ఇద్దరు కార్యకర్తలు కలిసి పొలంలోనే ఎక్కువ మద్యం తాగడం వలన ఇబ్బంది తలెత్తిందని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు కూడా దీనిని ధ్రువీకరించారని గుర్తుచేశారు. వారు ఉల్లిపాయాలను మార్కెట్‌కు తీసుకెళ్లలేదని, అవి పొలంలోనే ఉన్నాయని గ్రామస్థులు తెలిపినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఈఘటనపై ప్రభుత్వ అధికారులు విచారణ చేస్తున్నారన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా: ఏవో

గూడూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి దస్తగిరి రెడ్డి అన్నారు. సోమవారం గూడూరు మండలంలోని కె నాగలాపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఏవో రైతులతో సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో ఆవుట్‌రీచ్ ప్రోగ్రాంను నిర్వహించామన్నారు. నానోయూరియాను రైతులు ఉపయోగించవచ్చన్నారు. ప్రస్తుతం మండలంలో సుమారు 63.25 టన్నుల యూరియా ప్రైవేట్ డీలర్ల వద్ద ఉందన్నారు. అలాగే ఆర్ఎస్కేల వద్ద 4.275 టన్నుల యూరియా ఉందన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఏవో దస్తగిరి రెడ్డి

చదువుతో పాటు నైపుణ్యాన్ని పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఉపకులపతి వెంకట బసవరావు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాన్ని కూడా పెంచుకోవాలని ఉపకులపతి వి.వెంకట బసవరావు అన్నారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలో నూతనంగా చేరిన ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సర విద్యార్థులతోపాటు లేటరల్ ఎంట్రీ ద్వారా ద్వితీయ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఓరియం టేషన్ కార్యక్రమం నిర్వహించారు. వర్సిటీ కొత్తగా నెలకొల్పిన కంప్యూటర్ సైన్సు ల్యాబ్‌లు ఎంతో విద్యార్థులకు ఉపక రిస్తాయన్నారు. రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, రాయలసీమ అలైడ్ కెమికల్స్ లిమి టెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి, ప్రిన్సి పాల్ సీవీ కృష్ణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు చూపాలి: సీపీఎం


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు ఇంటి స్థలాలు చూపాలని ఓర్వకల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సీపీఎం జిల్లా ప్రధాన కార్య దర్శి గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ మండలంలోని నన్నూరు గ్రామంలో గత వైసీపీ ప్రభుత్వంలో ఇంటి పట్టాలు ఇచ్చారే గానీ, స్థలాలు చూపలేదన్నారు. ఆ స్థలాలు చూపాలని ఆందోళనలు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, మధుసూదన్, మల్లేష్, రామకృష్ణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక మైఫర్ ఫార్మసీ కళాశాలలో సోమవారం నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆప్తమాలజిస్టు డాక్టర్ కె.స్వాతి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కాసర్ల సురేష్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ విభాగం ప్రారంభం


ఫిజియోథెరపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న కిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ సుధాకర్

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కిమ్స్ హాస్పిటల్ హరితం బ్లాకులో అత్యాధునిక ఫిజియోథెరపీ విభాగాన్ని ఆస్పత్రి ఎండీ డాక్టర్ జి.సుధాకర్, సీఈవో డా.సునీల్ సేపూరి డా.ఆర్థో సర్జన్, డా.కిరణ్ కుమార్, డా.రాజేష్ ప్రారంభించారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ సుధాకర్, సీఈవో సునీల్ సేపూరి మాట్లాడుతూ పచ్చని చెట్ల మధ్య స్వచ్ఛమైన ఆక్సిజన్ వచ్చే ప్రాంతంలో ఫిజియోథెరపీ విభాగంతో రోగులు త్వరగా కోలుకుంటారన్నారు. వరల్డ్ ఫిజియోథెరపీ డే సందర్భంగా ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు ఉచిత ఫిజియోథెరపీ ఓపీ సేవలపై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు కన్సల్టెంట్ ఫిజియోథెరపీస్టు డాక్టర్ అర్షద్ తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఓర్వకల్లు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటారని సబ్ యూనిట్ ఆఫీసర్ నజీర్ అహ్మద్ అన్నారు. సోమవారం ఓర్వకల్లులోని ఇంటింటి తిరిగి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి వద్ద నీటి నిల్వ లేకుండా ఉంచుకోవాలని, డ్రైనేజీలను శుభ్ర పరుచుకోవాలని, తొట్లలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట ఏఎస్ఎం మహేశ్వరమ్మ, సిబ్బంది ఉన్నారు.


పరిసరాలను పరిశీలిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్

ప్రత్యేక సచివాలయం ఏర్పాటు చేయాలి


విష్ణువర్ధన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

కర్నూలు రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మునగాలపాడు గ్రామ పరిధిలో ఉన్న గీతాముఖర్జీనగర్, సమతానగర్ కాలనీలకు ప్రత్యేక సచివాలయం ఏర్పాటు చేయాలని కాలనీవాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ రెండు కాలనీ ప్రజలు సోమవారం కేడీసీసీబీ చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీవాసులు మాట్లాడుతూ సమతానగర్, గీతాముఖర్జీనగర్ కాలనీలు మునగాల పాడు పరిధిలో ఉన్నాయని, ప్రభుత్వ పరంగా ఎలాంటి సమస్య వచ్చిన మునగాలపాడులో ఉన్న సచివాలయానికి వెళ్ళాల్సి వస్తోందన్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పెన్షన్ తీసుకోవాలన్న దాదాపు మూడు కిలోమీటర్లు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. ఈ రెండు కాలనీలకు కలిసి సచివాలయ కార్యాల యాన్ని ఏర్పాటు చేస్తే ఎలాంటి సమస్య ఉండదన్నారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడి కాలనీలో సచివాలయ కార్యాలయాన్ని ఏర్పాటుకు కృషి చేస్తానని విష్ణువర్ధన్ రెడ్డి కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు/ ఓర్వకల్లు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. సోమవారం మాధవీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. అందులో భాగంగా పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల, కల్లూరు అర్బన్, రూరల్ మండలాల ప్రజలు 52 మందికి రూ.42,73,515 చెక్కులను అందజేశారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న అన్నారు. మండలంలోని కల్లపరి ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాలికా సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమానికి వైద్యాధికారి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు కాచి వడ బోసిన నీటిని తాగాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, హెచ్ఎం శాంతమూర్తి పాల్గొన్నారు.

తెలుగు అధ్యాపకురాలికి పురస్కారం


ఫమీదా బేగంను సన్మానిస్తున్న అతిథులు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఎం ఫమీదా బేగం జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. సోమవారం పాతబస్తీలోని కామర్స్ భవన్‌లో అధ్యాపకులు ఫమీదా బేగంకు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పునర్కరించుకుని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ కర్నూలు సంస్థ సంయుక్తంగా అందించే ఈ అవార్డును కర్నూలు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్‌రావు, మాజీ జిల్లా గవర్నర్ నాగేశ్వరరావు, కేవీ సుబ్బారెడ్డి, ఏపీ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషాలు ప్రదానం చేశారు. అనంతరం ఆమెను సన్మానించారు.

గరికపాటి రాజారావుకు ఘన నివాళి


గరికపాటి రాజారావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రజానాట్య మండలి సభ్యులు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కేకే భవన్‌లో ప్రజానాట్యమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు గరికపాటి రాజారావు వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ గరికపాటి కలలపై ఉన్న మక్కువతో ఎక్కడ బుర్రకథలు, హరికథలు జరుగుతున్న వాటికి హాజరై తన నైపుణ్యతను పెంచుకున్నారన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి ఉపాధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, సాయిఉదయ్, పి.సోమేశ్వరి, బీసన్న, కేసన్న పాల్గొన్నారు.

యాగంటీశ్వరస్వామికి తహసీల్దార్ పూజలు


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న అర్చకులు

ఓర్వకల్లు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో వెలసిన అంబాసహిత యాగంటీశ్వరస్వామి ఆలయంలో ఆరాధన ఉత్సవాల సందర్భంగా సోమవారం తహసీల్దార్ విద్యాసాగర్ స్వామి వారికి పూజలు చేశారు. ఆయనకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం.. లారీ సీజ్


అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం బస్తాలు

మహానంది, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి రేషన్ బియ్యం లోడ్‌తో ఉన్న లారీని నంద్యాల సివిల్ సప్లయీస్ డీఎస్‌వో శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది సీజ్ చేశారు. గ్రామంలోని ఒక ఇంటిలో రేషన్ బియ్యం నిల్వలను అక్రమంగా నిల్వ ఉంచి లారీలో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు తరలించడానికి సిద్ధం అవుతుండగా సమాచారం అందుకొన్న సివిల్ సప్లయీస్ అధికారులు దాడులు నిర్వహించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని 250 బియ్యం బస్తాల లోడ్‌తో ఉన్న లారీని సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న లారీని నంద్యాలకు తరలించారు. కార్య క్రమంలో నంద్యాల సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహసీల్దార్ రవి బాబు, వీఆర్వో జయరాముడు పాల్గొన్నారు.

గుంతల దారి



మండలంలోని ఆలూరు-పెద్దహోతూరు గ్రామాల మధ్య కర్నూలు రహదారిలో అడుగుకో గుంత ఉంది. దాదాపు 10కి.మీ.ల మేర గుంతలు ఉండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు గుంతలను పూడ్చాలని కోరుతున్నారు. - ఆలూరు రూరల్

దారి విస్తరణం



ఆలూరు-హొళగుంద రహదారి విస్తరణకు రూ.3.50 కోట్ల నాబార్డ్ నిధులు మంజూరయ్యాయి. అయితే ఆక్రమణలను తొలగించేందుకు కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. పంచాయతీ అధికారులు ఆక్రమణలను తొలగిస్తే పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు.- ఆలూరు

ఇన్‌చార్జి ఎంపీడీవోగా రమాదేవి



ఆలూరు రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి ఎంపీడీవోగా రమాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మద్దిలేటిస్వామి శిక్షణకు వెళ్లడంతో ఇదే కార్యాల య ఏవో రమాదేవిని ఉన్నతాధికారులు ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు. గ్రామాల్లో సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని, సంక్షేమ పథకాలు అందిస్తామని రమాదేవి అన్నారు. ప్రజలకు అందుబా టులో ఉండి సేవలు అందించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మద్దికెర సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ విద్యార్థులు వర్షిత, సురేష్ రాష్ట్రస్థాయి అండర్-14 హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు విద్యాసాయి ఇంగ్లీషు మీడియం పాఠశాల కరస్పాండెంట్ వెంకట మాధవ్, ప్రిన్సిపాల్ బాల సునీత తెలిపారు. సోమవారం కర్నూలు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ప్రతిభ చూపారన్నారు. పీఈటీ ఇస్మాయిల్, ఆనంద్ రావు ఉన్నారు.



వర్షిత



సురేష్

ఫిజియోథెరపీతో ఉపశమనం



ఫిజియోథెరపిస్టులను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

ఆదోని టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక రోగాలకు ఫిజియోథెరపీతో ఉపశమనం లభిస్తుందని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మెన్లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాద్ రావు అన్నారు. అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా సోమవారం డాక్టర్లు జాహెద్, అబ్దుల్ ఖలీక్‌ను సన్మానించారు. ఎముకలు, కీళ్లశస్త్ర చికిత్సల అనంతరం ఫిజియోథెరపీ అవసరమన్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మారెడ్డి, శ్రీనాథ్ గుప్తా, కోశాధికారి వన్నప్ప రాజు, ఓం ప్రకాష్, నీలమోహన్, గోవిందరాజమూర్తి పాల్గొన్నారు.

నానో యూరియా పిచికారీ చేయండి

ఆదోని రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలకు నానో యూరియా పిచికారీ చేయాలని ఏవో సుధాకర్ సూచించారు. సోమవారం సిబ్బందితో కలిసి ఆరేకల్లు రైతు సేవ కేంద్రంలో నానో యూరియాను పంపిణీ చేశారు. నానో యూరియాను వాడితే భూసారం పోదన్నారు. సతీష్, రామకృష్ణ, రఘువరణ్ ఉన్నారు.



నానో యూరియాను పంపిణీ చేస్తున్న ఏవో

చెరువును స్వాధీనం చేసుకోవాలి

ఆదోని రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండవగల్లు గ్రామం పెద్ద చెరువును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, లింగన్న డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. సర్వే నెం.135లో 20 ఎకరాల్లో పెద్ద చెరువు ఉందని కొందరు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు హైకోర్టు పరిధిలో ఉన్నా అక్రమణదారులు సాగు చేస్తున్నారని ఆరోపించారు. చెరవు సమస్యను పరిష్కరిస్తానని ఎన్నికల్లో ఎమ్మెల్యే పార్థసారధి ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు.



వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

సమస్యలను వేగంగా పరిష్కరించండి

● సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్



ప్రజల సమస్యలను వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అర్జీల రూపంలో వచ్చిన ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో డివిజన్‌లోని మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరచాలని సూచించారు. మండలంలోని శాఖల అధికారులకు సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏవో వసుంధర, సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, డీఎల్‌పీవో తిమ్మక్క, ఆర్‌అండ్‌బీ ఈఈ పద్మనాభరెడ్డి, హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్, డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి, రమాదేవి, డీటీ బాబు, రుద్రగౌడ్ పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన కల్పించాలి

● జిల్లా మలేరియా అధికారి నూకరాజు



రికార్డును పరిశీలిస్తున్న అధికారి నూకరాజు

ఆలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు డెంగీ, మలేరియా నివారణపై అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి నూకరాజు సూచించారు. సోమ వారం ఆలూరు మండలం మొలగవెల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వాతావరణ మార్పులు, వర్షాల కారణంగా దోమలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగ్యూ, జ్వరాలు అధికమవుతున్నాయని, రోగులను పరీక్షించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని, లక్షణాలు కనిపిస్తే వెంటనే జిల్లా కేంద్రానికి రిపోర్టు ఇవ్వాలన్నారు. ప్రజలు కాచి వడబోసిన నీటిని తాగాలని, దోమలు వ్యాప్తి చెందకుండా దోమ తెరలను వాడాలన్నారు. వైద్యులు మల్లేశ్వరి, ల్యాబ్ టెక్నీషియన్ పురుషోత్తం, హెడ్ నర్స్ రాధ, స్టాఫ్ నర్స్ రమాదేవి, ఏఎన్ఎంలు నాగవేణి, చంద్రకళ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రీ సర్వేలో పొలం మాయం

● తుగ్గలి రైతు అన్వర్‌బాషా ఆందోళన

తుగ్గలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గతేడాది క్రితం వైసీపీ హయాంలో తన పొలం మొత్తం తొలగించాలని న్యాయం చేయాలని తుగ్గలికి చెందిన రైతు అన్వర్‌బాషా ఆరోపించారు. బాధితుడి కథనం మేరకు.. ఎల్‌పీఎం నెంబర్ 960, 635 సర్వే. నెంబర్‌లోని 1.76ఎకరాల తన భూమిని బంగీ మారెమ్మ అనే మహిళ పేరుపై ఆన్‌లైన్ చేశారు. ఇప్పటికీ భూమిని తానే సాగు చేస్తున్నానని, భూమి రికార్డులన్నీ తన వద్ద ఉన్నాయని ఏడాది నుంచి కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దార్ రవిని వివరణ కోరగా సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



ప్రకృతి సేద్యంతో మేలు



కూరగాయలను కొనుగోలు చేస్తున్న అధికారులు

తుగ్గలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యంతో రైతుకు లాభం వస్తుందని, వినియోగదారులకు మేలని ఆర్ఐ వెంకట్రాముడు, టీడీపీ నాయకుడు తిరుపాల్ నాయుడు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించారు. ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణతో పాటు భూమి సారవంతంగా మారుతుందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభం గడించవచ్చన్నారు. సీనియర్ అసిస్టెంట్ రాముడు, వీఆర్వో కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు

మద్దికెర సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని తహసీల్దార్ గూండాల్ నాయక్ తెలిపారు. సోమవారం కార్యాలయంలో మాట్లాడుతూ మద్దికెర, ఎం.అగ్రహారం తదితర గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసిన వారిలో ఇప్పటికే స్థలాలు మంజూరైన వారికి ఇవ్వరని తెలిపారు. ఆర్ఐ రామదాసు, వీఆర్వో రంగస్వామి ఉన్నారు.

పంచాయతీలకు నిధులు మంజూరు

తుగ్గలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరైనట్లు డిప్యూటీ ఎంపీడీవో శ్రీహరి సోమవారం తెలిపారు. నిధుల వివరాలు కార్యదర్శుల వద్ద ఆన్‌లైన్‌లో ఉంటాయని, పది రోజుల్లో ఖాతాలకు జమ అవుతాయన్నారు.

12న జాబ్‌మేళా

ఆలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12వ తేదీన ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.జ్ఞానేశ్వర్ సోమవారం తెలిపారు. పది కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు విరుపాక్షి, గుమ్మనూరు జయరాం, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ హాజరవుతారన్నారు.

ఆర్థిక సంఘం నిధులు విడుదల

● ఇన్‌చార్జి డీఎల్‌పీవో రామచంద్రారెడ్డి

పత్తికొండ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు రెండో విడత 15వ ఆర్థికసంఘం నిధులు విడుదలయ్యాయని ఇన్‌చార్జి డీఎల్‌పీవో రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ప డివిజన్ పరిధిలో మొత్తం 155 గ్రామ పంచాయతీలకు సంబంధించి రూ.6.43,25,856 విడుదలయ్యాయన్నారు. పంచాయతీల ఖాతాలకు ఈ నిధులు జమ అవుతాయన్నారు.



ప్రేమ వివాహం చేసిన టీడీపీ నాయకులు



ప్రేమజంటతో టీడీపీ నాయకులు

మద్దికెర సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనపల్లి పంచాయతీ కార్యదర్శి మంజునాథ్, మద్దికెర గ్రామ సచివాలయ మహిళా పోలీసు రాజేశ్వరికి టీడీపీ నాయకులు ప్రేమ వివాహం చేశారు. కొన్నేళ్లుగా వీరు ప్రేమించుకుంటున్నారు. సామాజిక వర్గాలు వేరు కావడంతో ఇరువురు పోలీసులను ఆశ్రయిం చారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఇరు కుటుంబాలకు నచ్చజెప్పి సోమవారం మద్దికెరలోని ఓ ఆలయం వదద్ద వివాహం చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, సర్పంచ్ బొమ్మనపల్లి ఆంజనేయులు, టీడీపీ నాయకులు రంగస్వామి, హరినాథ్‌గౌడు, రాధమ్మ ఉన్నారు.

మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ దుర్మార్గం



రహదారిపై బైఠాయించిన విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ఆరేకల్ గ్రామ సమీపంలో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని పీడీఎస్‌వో నాయకుడు తిరుమలేష్, డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దనాపురం ఉదయ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ప్రవేటీకరణను వ్యతిరేకిస్తూ పీడీఎస్‌వో, డీఎస్ఎఫ్ నాయకులు విద్యార్థులతో కలిసి ఆర్ట్స్ కళాశాల రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. గత ప్రభుత్వం గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్న ఉద్దేశంతో ఆదోనిలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కళాశాల పనులను నిలిపివేసి పీపీపీ(పబ్లిక్ ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్) పద్ధతిలో కొనసాగించడానికి క్యాబినెట్‌లో తీర్మానం చేయడం అన్యాయమన్నారు. ప్రైవేటీకరణతో పేదలకు వైద్యం అందే పరిస్థితి ఉండదని ప్రభుత్వమే వైద్య కళాశాలను నడపాలని డిమాండ్ చేశారు. పీపీపీ విధానాన్ని రద్దు చేయకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. శివ, రాజేష్, వినోద్, నరసింహులు, ఇస్మాయిల్, రామకృష్ణ పాల్గొన్నారు.

అక్షరాస్యత పెంచాలి

క్రిష్ణగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్షరాస్యత శాతాన్ని పెంచాలని ఎంపీడీవో మోహన్‌కుమార్, ఎంఈవో సునంద సుచించారు. సోమవారం కెజీబీవీ పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. మండలంలో నిరక్షరాస్యత ఎక్కువగా ఉందని, అక్షరాస్యత శాతం పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. వయోజనవిద్య ఏపీవో ప్రతాప్, సూపర్‌వైజర్ రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో మోహన్‌కుమార్

మరమ్మతులు చేయాలి



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న మహిళలు

ఆదోని, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గుంతలు పడ్డ రహదారులకు మరమ్మతులు చేయించాలని మహిళలు శ్రీలక్ష్మి, మంజుల, రేణుక కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందించారు. పట్టణంలోని కొత్త బ్రిడ్జి కింద మంత్రాలయానికి వెళ్లే రహదారిలో రోడ్డుపై గుంతలుపడి వర్షపు నీరు నిల్వ ఉండడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే హొళగుంద రోడ్డులో ప్రయాణం చేయాలంటేనే వాహనదారులు ఆందోళన చెందుతున్నారని వాపోయారు. మరమ్మతులు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారన్నారు. స్పందించిన సబ్ కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మహిళలపై దాడులకు వ్యతిరేకంగా పోరు



ఎమ్మెల్యే విరుపాక్షిని కలిసిన వైసీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సిద్ధారెడ్డి రేణుక

ఆలూరు(చిప్పగిరి), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని వైసీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సిద్ధారెడ్డి రేణుక కోరారు. సోమవారం చిప్పగిరిలో ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షితో ఆమె చర్చించారు. మహిళలతో కలిసి కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామస్థాయిలో మహిళా కమిటీలను నియమించాలన్నారు. అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వంపై యుద్ధం సాగిద్దామని కోరారు.

పనిచేసే వారికి ప్రాధాన్యమివ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసేవారికి నామినేట్ పదవులు ఇవ్వాలని ఆలూరు టీడీపీ నాయకులు నేమకల్ రవి, అశోక్, రాము, అంజి కోరారు. సోమవారం అనంతపురంకు వచ్చిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌యాదవ్‌కు వినతి పత్రం ఇచ్చారు. పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. టీడీపీ జోనల్ 5 ఇన్‌చార్జి బీద రవిచంద్ర, ఎంఎల్‌సీ రామ్‌గోపాల్‌రెడ్డిని టీడీపీ నాయకులు వన్నూరువలి, దద్దు, తిప్పేస్వామి, అంజిరెడ్డి కలిశారు.

అక్షరాస్యతతో దేశాభివృద్ధి

దేవనకొండ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి సాధ్యమని గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. పుస్తకాల ద్వారా ప్రపంచ విషయాలు తెలుస్తాయని విద్యార్థులకు వివరించారు. జ్ఞానసుధ పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

యూరియా కొరత లేదు : ఏడీఏ

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో యూరియా కొరత లేదని ఏడీఏ బాలవర్ధిని రాజు తెలిపారు. సోమవారం మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో 138.60 టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశామన్నారు. మార్క్‌ఫెడ్ గోడౌన్‌లో 2230 టన్నుల యూరియా సూపర్ స్టార్ కింద అందుబాటులో ఉంచామన్నారు. వరి రైతులు అవసరాన్ని బట్టి రైతు సేవా కేంద్రాలలో యూరియాను తీసుకోవచ్చు అన్నారు విచ్చలవిడిగా యూరియాను పిచికారీ చేయవద్దని సూచించారు. ప్రైవేటు డీలర్లు ఎంఆర్‌పీ ధరకు మాత్రమే అమ్మాలని, ఎరువు లింకు అంటగట్టరాదని తెలిపారు.

మంత్రాలయంలో శాంతి పూజలు



శ్రీమఠంలో శాంతి హోమాలు చేస్తున్న పండితులు, పీఠాధిపతి

మంత్రాలయం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి సన్నిధానంలో చంద్రగ్రహణం సందర్భంగా శాంతి హోమాలు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున తుంగభద్ర నదిలో పీఠాధిపతి, పండితులు, శిష్యులు, మఠం ఉద్యోగులు దండోదక స్నానాలు ఆచరించారు. వేద పండితుల మంత్రోచ్చారణాలు, మంగళవాయిద్యాల మధ్య నవగ్రహ, శాంతి హోమాలు చేసి సంప్రోక్షణ చేశారు. అనంతరం రాఘవేంద్రస్వామి బృందావనానికి పూజలు చేసి హారతులు ఇచ్చారు.

వైసీపీతోనే అన్నదాతల అభివృద్ధి సాధ్యం



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

గోనెగండ్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలోనే అన్నదాతల అభివృద్ధి చెందారని మాజీ ఎంపీపీ, మండల వైసీపీ అధ్యక్షుడు వేముగోడు కృష్ణారెడ్డి అన్నారు. యూరియా కోసం మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టే నిరసన కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. వాల్‌పోస్టర్స్‌ను సోమవారం గోనెగండ్లలోని వైసీపీ కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు మన్సూర్, భాస్కర్‌రెడ్డి, మురళినాయుడు, దొరబాబు, ఇమ్రాన్, ఉరుకుందరెడ్డి, శివరామ్, నాయుడు, గంగాధర్, కల్లపారి రఘు, ఖాజా, రాజారెడ్డి, రహిమాన్ పాల్గొన్నారు.

నందవరం: ఆదోనిలో మంగళవారం చేపట్టే అన్నదాత పోరును జయప్రదం చేయాలని వైసీపీ రాష్ట్ర నాయకులు విరుపాక్షిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రామకోటిరెడ్డి కోరారు. సోమవారం నందవరంలో మండల పార్టీ కన్వీనర్ శివారెడ్డిగౌడు ఆధ్వర్యంలో పోస్టర్ల విడుదల చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, సోమలగూడురు వెంకటేశ్వరరెడ్డి, రాజాశరత్, ఎల్లాగౌడు, దత్తప్పగౌడు, రమేషప్పగౌడు, కష్ణమూర్తి పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుతో ఆదాయాన్ని పెంచాలి

గోనెగండ్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామ పంచాయతీలో వర్మీకంపోస్టును తయారు చేసి, పంచాయతీలకు ఆదాయం పెంచాలని ఈవోఆర్‌డీ అనంతశయన కార్యదర్శులకు సూచించారు. సోమవారం గోనెగండ్లలోని చెత్త సంపద కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రోజుకు ఎంత చెత్త సేకరిస్తున్నారని, దాంతో ఎంత వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారని కార్యదర్శి సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని ప్రతి పంచాయతీ అధికారులు పాటించాలని కోరారు. గ్రామాల్లో తాగునీటి సమస్య, వీధిదీపాల సమస్య లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మలాంగ్, సుబాన్, అనిల్, గ్రీన్ అంబాసిడర్‌లు పాల్గొన్నారు.

రైతులు నానో యూరియాను వినియోగించాలి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు నానో యూరియాను వినియోగించాలని జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి కోరారు. సోమవారం మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాంకేతికత- విలువ జోడింపు శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి మాట్లాడుతూ రైతులు యూరియా కొరతను అధిగమించేందుకు నానో యూరియాను అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రస్తుతం జిల్లాలోని రైతులకు యూరియా అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమానికి దాదాపు 150మందికి పైగా రైతులు హాజరయ్యారు. అనంతరం రైతులకు రూ.3వేలు విలువ చేసే తార్పలిన్‌లను అందజేశారు. కార్యక్రమంలో కళాయి శ్రీనివాసులు, శ్రీనివాసులు, సంగప్ప, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.



గోనెగండ్ల బైపాస్ రోడ్డు ఎద్దుల మార్కెట్ దగ్గర వాడిపోతున్న ఈత చెట్లు



ఎల్లెల్సీ పిల్ల కాలువ పక్కన స్థలంలో నాటిన మొక్కలు కనిపించని దృశ్యం



హెచ్‌బీఎస్ కాలనీ ఎల్లెల్సీ పిల్ల కాలువ పక్కన గుంతలో కనిపించని మొక్కలు

మొక్కుబడిగా నాటారు..

● నీరు, సంరక్షణ లేక ఎండుతున్న మొక్కలు

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పచ్చదనం కోసం మున్సిపాలిటీ అధికారులు మొక్కలు నాటారు.. అయితే వాటిని సంరక్షించడం మాత్రం మరిచారు. దీంతో నాటిన మొక్కలు ఎండుతున్నాయి. ఇటీవల పట్టణంలోని ఆదోని, గోనేగండ్ల బైపాస్‌రోడ్డు డివైడర్ మధ్యలో వివిధ రకాల మొక్కలతోపాటు అందంగా కనిపించాలని ఎద్దుల మార్కెట్ దగ్గర ఈత చెట్లను సైతం నాటారు. అయితే వాటికి నీరులేక ఎండిపోతున్నాయి. అలాగే హెచ్‌బీఎస్ కాలనీలో ఎల్లెల్సీ పిల్లకాలువను ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో అందమైన మొక్కలను నాటారు. మొక్కలను సంరక్షించడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు.గతంలో న్యూ ఇందిరా నగర్ వెంకటసాయి ఆలయం వెనుక ఉన్న రహదారిలో మొక్కలు నాటి, వాటికి కంచెలు ఏర్పాటు చేయకపోవటం పశువులు నాశనం చేశాయి. అధికారులు డబ్బులు కాజేసేందుకే తూతూ మంత్రంగా మొక్కలు నాటుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, శ్రీరాములు, సోమేశ్వరనాయుడు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగార్జునగౌడ్, ఆదాము, రాజు, శ్యాంసోన్, మహాలింగ, రామాంజి, కల్యాణ్‌లు పాల్గొన్నారు.

దళితుల సమ్మేళన సభను జయప్రదం చేయండి

నందవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో 13న జరిగే దళితుల సమ్మేళన సభను జయప్రదం చేయాలని అబేద్కర్ భవన సాధన కమిటీ నాయకులు ముగతి నరసన్న, దేవపాల్, దావీదు, దానమయ్య తెలిపారు. సోమవారం ముగతిలో పోస్టర్ల విడుదల చేశారు. వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా ముందుకు వచ్చి సభను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సంషోన్, ఆనంద్ రాజేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది



ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి మించిన వృత్తి మరేది లేదని, ఈ వృత్తి ఎంతో గొప్పదని ఎమ్మిగనూరు ఎంఈఓ ఆంజనేయులు, పత్తికొండ ఎంఈఓ రాజారంలు అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పట్టణానికి చెందిన నాగేంద్ర కుమార్, పీఈటీ నరసింహరాజు, దోర్నాల శ్రీనివాసులు, అండర్ 19స్కూల్ గేమ్స్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శిగా ఎంపికైన రాఘవేంద్రలను స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం ప్రిన్స్ స్వచ్ఛందసేవా సంస్థ అధ్యక్షులు వహాబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఫుడ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణ, జీజేసీ వైస్‌ప్రిన్సిపాల్ లుక్మాన్, కోచ్ మాబు సాబ్, హెచ్‌ఎం నాగరాజు,శ్రీధర్, బసవరాజు పాల్గొన్నారు.

టీడీపీ మండల కమిటీ ఎన్నిక

నందవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత మండల కమిటీని సోమవారం పూర్తి స్థాయి కమిటీలను ఎన్నుకున్నారు. మండల టీడీపీ అధ్యక్షుడిగా కాశీంవలీ(మాచాపురం) ఉపాధ్యక్షుడిగా బ్రహ్మానందరెడ్డి(చిన్నకొత్తిలి) ప్రధాన కార్యదర్శిగా(లచ్చప్పనాయుడు(నందవరం) మండల అర్గనైజింగ్ కార్యదర్శులుగా శంకరమ్మ(ఇబ్రహింపురం) చార్లేష్(గురుజాల) బార్గవ్‌యాదవ్(ముగతి) మండల కార్యదర్శులుగా గడంగం నరసింహులు(జగ్గాపురం) ప్రభుదాస్(హలహర్వి) యంకప్ప(పెద్దకొత్తిలి) మండల కోశాధికారిగా గీతాబాయి(కనకవీడు)లను నియమించారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యూరియా కృత్రిమ కొరతను సృష్టిస్తున్న వ్యవసాయ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అధికారులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ శేషఫణికు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగరాజు, వెంకటేష్, ఐఎఫ్‌టీయూ నాయకులు బాబు, యల్లప్ప, వీరాంజిని, మల్లికార్జున, రమేషప్ప, సంజన్న పాల్గొన్నారు.

పెద్దకడబూరు: యూరియాను కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి సుచరిత, సీఐ మంజునాథ్ హెచ్చరించారు. సోమవారం పెద్దకడబూరులోని ఎరువుల దుకాణాలు, గోడౌన్‌లను ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. యూరియాను అధిక ధరలకు విక్రయించినా, వ్యవసాయేతరులకు విక్రయించినా, ఇతర రాష్ట్రాలకు తరలించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

నందవరం: రైతులు యూరియాపై ఆందోళన చెందవద్దని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని గురుజాల, కనకవీడు, హలహర్వి, మిట్టా సోమాపురం గ్రామాల రైతులతో ఆయ గ్రామాల్లోకు వెళ్లి మాట్లాడారు. మండలంలోని 5 గ్రామాలకు కలసి 21.6 మెట్రిక్ టన్నులు వచ్చిందని, ప్రతి ఒక్కరికి అందిస్తున్నామన్నారు.

మంత్రాలయం: మంత్రాలయం మండలంలో ఎరువులు, యూరియాకు కొరత లేదని అన్ని ప్రైవేటు డీలర్ల వద్ద ఎరువులు అందుబాటులో ఉన్నాయనీ తహసీల్దార్ రమాదేవి, మండల వ్యవసాయాధికారి జీర గణేష్ అన్నారు. సోమవారం మండలంలోని మాధవరం, మంత్రాలయం, కాచాపురం, తదితర దుకాణాలను తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న రికార్డులను స్టాక్ రిపోర్టులను గోడౌన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నానో యూరియా వాడాలని రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం యూరియాను రైతులకు అందజేశారు. యూరియా కోసం రైతులు ఎవరూ ఇబ్బందులు పడవద్దని, టోల్‌ఫ్రీ. నెం.8341302860కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో తిరుమల్‌రెడ్డి, ఎంపీవోలు విజయ్, రాజేష్, రైతులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించని ప్రభుత్వం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని బుట్టా రేణుక అన్నారు. సోమవారం ప్రభుత్వ ఆసుప్రతిన్ని పరిశీలించారు. బుట్టా రేణుక రోగులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చిన్న పిల్లల వార్డును, జనరల్ వార్డు, స్కానింగ్ సెంటర్, ల్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లలకు సంబంధించిన డాక్టర్ లేకపోవడంతో పిల్లలకు సరైన వైద్యం అందడం లేదన్నారు. రోజుకు 200 మంది చిన్న పిల్లలు జ్వరాలతో హాస్పిటల్‌కు వస్తున్నారన్నారు. హాస్పిటల్‌కు సరిపడా సిబ్బందిని నియమించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. రక్తపరీక్షలకు సంబంధించిన కిట్లు, స్కానింగ్ తీయించుకున్న వారికి ఎక్స్‌రే ఫీలిమ్స్ ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఆసుపత్రికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వస్తుంటారని, వారికి మెరుగైన వైద్య అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బుట్టా శివనీలకంఠ, నాగేషప్ప, కోటకొండ నరసింహులు, సునీల్, పాలశ్రీను పాల్గొన్నారు.

రాష్ట్ర బీసీ కో అపరేటివ్ కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా డీవీ రాముడు



నందవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ కో అపరేటివ్ కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా నందవరం దేవళ్ల వెంకట్రాముడును ప్ర భుత్వం ఎంపిక చేసింది. 25 ఏళ్లుగా మండల పార్టీ కన్వీనర్‌గా పని చేశా డు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేశాడు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడి సిఫారస్ మేరకు ప్రభుత్వం ఎంపిక చేసింది. తనకు ఈ పదవి ఇచ్చిన సీఎం నారాచంద్రబాబు నాయుడుకు, మంత్రి నారాలోకేశ్‌కు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పాతళగంగ పైపైకి..



నీటితో నిండిన బావి

గోనెగండ్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బావులు, బోర్లలో పాతళగంగమ్మ ఉబికి వస్తుంది. బావులు బోర్లలో నీరు ఊరుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మిగనూరు డివిజన్‌లో బావులు, బోర్ల కింద పత్తి, వేరుశనగ, ఉల్లి, కంది, తదితర పంటలను 20వేల ఎకరాలలో సాగు చే శారు. అలాగే హంద్రీ నదిలో కూడా నీరు పారడంతో భూగర్భ జలాలు ఊరుతున్నాయి. దీంతో హంద్రీ పరిసర గ్రామాలైన గాజుల దిన్నె, హెచ్ కైరవాడి, వేముగోడు, పిల్లిగుండ్ల, తిప్పనూరు, బోదేపాడు, వీరంపల్లి, పుట్టపాశం, గ్రామాల రైతులు హంద్రీనీటితో పంటలు పండించుకుంటున్నారు. ఈ గ్రామాలలో దాదాపు 1000 ఎకరాల పైగానే పంటలను సాగు చేశారు.

పశుగ్రాసానికి డిమాండ్

గోనెగండ్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది గ్రాసం ధర చుక్కలు చూపుతుంది. గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కోసిగి, మండలాల్లో ఎక్కువగా వర్షాలు కురియడం, చేతికి అందిన గ్రాసం నల్లగా మారిపోయింది. దీనికి తోడు ఈ మండలాలలో పత్తి, మిరప, పంటలు సాగు చేశారు. దీంతో గ్రాసం కొరత ఏర్పడింది. ట్రాక్టర్ గ్రాసం రూ.15వేల నుంచి 18 వేల వరకు పలుకుతుంది. గోనెగండ్ల మండలంలో ఆవులు, ఎద్దులు, 15,530, బర్రెలు 5,603, గొర్రెలు, 65,257, మేకలు 740, కోళ్ల బాతులు 30,665లు ఉన్నాయి. బళ్లారి, ప్రాంతాల నుంచి పశువుల యజమానులు గ్రాసాన్ని దిగుబడి చేసుకుంటున్నారు.



ఓపిక ఉండాల్సిందే..!



ఓపీ కోసం ఎండలో నిలబడ్డ రోగుల బంధువులు

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలలో ఓపీ కావాలంటే గంటల కొద్ది సమయం పడుతోంది. దీంతో రోగలు ఎండకు నిలబడలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఆసుపత్రికి రోగులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఓపీ కోసం సుమారు 2 గంటలు వేచి ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓపీ వద్ద నీడ లేకపోవడంతో రోగులు వానకు, ఎండకు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైన వైద్యాధికారులు స్పందించి ఓపీ గది దగ్గర ఎండ తగలకుండా తగిన ఏర్పాట్లు చేయాలని రోగులు కోరుతున్నారు.

గోనెగండ్లలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు



కరపత్రాలను విడుదల చేస్తున్న ట్రాక్టర్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు

గోనెగండ్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో చింతాలముని, నల్లారెడ్డి స్వామి వారి దశమి మహోత్సవం సందర్భంగా 13,14,15వ తేదీలలో రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ట్రాక్టర్ యూనియన్ నాయకులు ఉసేన్, గానిగ రహంతుల్లా, శివన్న, నూర, గోపాల్, వెంకటేష్, మాబు, భాస్కర్ తెలిపారు. ఈ పోటీలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తామన్నారు. 13న 4పళ్ల సైజ్ ఎద్దుల పోటీలలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ. 30వేలు, రెండో బహుమతిగా రూ. 20వేలు, మూడో బహుమతిగా రూ. 15వేలు, నాలుగో బహుమతిగా రూ. 10వేలు, ఐదో బహుమతిగా రూ. 5వేలు అందజేయనున్నారు. అలాగే 14న ఆరుపళ్ల సైజు ఎద్దుల పోటీలలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ. 40వేలు, రెండో బహుమతిగా రూ. 30వేలు, మూడవ బహుమతిగా రూ. 20వేలు, నాల్గోబహుమతిగా రూ. 10వేలు, అందజేస్తారు. 15న న్యూక్యాటగిరి ఎద్దుల పోటీలలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ. 50వేలు, రెండో బహుమతి రూ. 40వేలు, మూడవబహుమతి, రూ. 30వేలు, నాలుగవబహుమతి రూ. 20వేలు, ఐదో బహుమతి రూ. 10వేలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు 9949151807, 8522014358లను సంప్రదించాలని కోరారు.

అవార్డు ప్రదానం



డి.నంబి దంపతులకు అవార్డు ప్రదానం చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని ఆధునీకరణ కట్టడంతో పాటు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రముఖ దేవాలయాల నిర్మాణాలకు రూపశిల్పిగా మారిన హైదరాబాదుకు చెందిన ప్రముఖ స్థపది టి.నంబి దంపతులకు అవార్డు ప్రదానం చేశారు. సోమవారం రాత్రి యాగశాలలో దేవాలయాలకు నంబి చేసిన కృషిని కొనియాడుతూ నగదు, వెండి తట్ట, మెమెంటో, ఫల పుష్ప మంత్రాక్షితలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, బద్రినాథ్, ఐపీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

జనసేన పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు



నామినేటెడ్ పోస్టులు పొందిన వారిని సన్మానిస్తున్న బి.లక్ష్మన్న

మంత్రాలయం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో జనసేన పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు దక్కుతాయని మంత్రాలయం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న అన్నారు. సోమవారం మంత్రాలయంలో తన నివాసంలో నామినేటెడ్ పదవులు వచ్చిన పెద్దకడుబూరు మండలం సింగిల్ విండో డైరెక్టర్, కోసిగి మార్కెట్ యార్డు డైరెక్టర్ కౌతాళం మండలం కుంటనహాల్ డైరెక్టర్లకు హనుమేష్, వీరారెడ్డి, హాజీ ముల్లంగ బాబాలను ఘనంగా సన్మానించారు. కష్టపడి పని చేసిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వీరారెడ్డి, బజార్, సుమిత్ర, రవిచంద్ర, పెద్ద సంఖ్యలో వాల్మీకులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న వయోజన విద్య సూపర్‌వైజర్ నెమలయ్య

మంత్రాలయం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న 3,398 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామని వయోజన విద్య సూపర్‌వైజర్ నెమలయ్య అన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో ఏపీఎం రాజశేఖర్ ఆధ్వర్యంలో వయోజనులకు విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉల్లాస్ పథకం ద్వారా గ్రామాల్లో వయోజనులకు సంతకాలు, ఆరోగ్య సూత్రాలు, డిజిటల్ అక్షరాస్యత, కంప్యూటర్ పరిజ్ఞానం వంటి అంశాలను పరిశీలిస్తామన్నారు. ఇందు కోసం ఒక్కో గ్రామానికి 8 మంది వలంటరీలను నియమించి ఒక్కొక్కరు పది మందికి చదువులు చెప్పాలన్నారు. సమావేశంలో వెలుగు సీసీలు రామలింగ, బసన్న, ఖాజా, మల్లికార్జున, మండల సమైఖ్య అధ్యక్షురాలు కళావతి, వీవోఏలు నాగవేణి, ఈశ్వరప్ప, తాయమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

చిరుత నుంచి కాపాడాలి

పెద్దకడబూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిరుత నుంచి కాపాడాలని ఏఐవైఎఫ్ నాయకులు ఉసేన్‌బాషా, రాజారియాజ్, రఘు కోరారు. సోమవారం మేకడోనలో వారు మాట్లాడుతూ గ్రామంలోని గత కొన్ని రోజుల నుంచి చిరుత పులి సంచరిస్తుండడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. అటవీశాఖ అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.